



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 338 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 8 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :338 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 8 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం.. ప్రకటించిన సీఎం చంద్రబాబు



- బీసీల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి
- ఇప్పటికే చట్టం ముసాయిదా సిద్ధమైందని చీరాలలో ప్రకటించిన ముఖ్యమంత్రి
- బీసీ వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు స్పష్టీకరణ
- చేనేత దినోత్సవం సందర్భంగా 'నేతన్న సేవలో' పథకం కింద రూ.179 కోట్లు విడుదల
- ఆర్థిక కష్టాలున్నా అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడబోమని చంద్రబాబు స్పష్టం

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీల) సంక్షేమం, సంరక్షణే ధ్యేయంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే 'బీసీ సంరక్షణ చట్టం' ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాలలో 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. బీసీలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు వివరించారు. "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుంది. వారి సంక్షేమంతో పాటు, రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం" అని ఆయన అన్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, వివిధ బీసీ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రెండేళ్లలో రూ.505 కోట్లు అందించామని, వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించామని గుర్తుచేశారు. అంతేకాకుండా, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు 3 కిలోవాట్లకు అదనంగా రూ.20 వేల సబ్సిడీ ఇస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రజలందరికీ రూ.2.5 లక్షల విలువైన యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 71,536 అర్హులైన చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున, మొత్తం రూ.179 కోట్ల ఆర్థిక సాయాన్ని

- మిగతా 2లో



## తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష నెరవేర్చిన సీఎం చంద్రబాబు

- సోషల్ మీడియాలో పోస్ట్ చూసి వృద్ధురాలిని పిలిపించుకుని ఫోటో దిగిన సీఎం
- మగ్గంపై తన చిత్రాన్ని నేసిన చేనేత దంపతులను కలిసిన చంద్రబాబు
- శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన నాగేశ్వరరావు, లక్ష్మీలకు అభినందనలు

**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు తన చీరాల పర్యటనలో మానవత్వాన్ని, కళ పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. తనను కలవాలని సోషల్ మీడియాలో కోరిన 90 ఏళ్ల వృద్ధురాలిని ప్రత్యేకంగా పిలిపించుకుని

- మిగతా 2లో




## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

- డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన
- లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ
- డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్
- విద్యా దీవెన బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభు త్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని

- మిగతా 2లో



## పెరిగిన విద్యుత్ డిమాండ్.. 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కొనుగోలుకు ఏపీ కసరత్తు

- ఏపీలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వ చర్యలు
- వేసవిలో 15,000 మెగావాట్లు దాటిన గరిష్ఠ విద్యుత్ వినియోగం
- బేస్‌లోడ్ స్థిరత్వం కోసం థర్మల్ విద్యుత్‌పై ఆధారపడాలని నిర్ణయం

- మిగతా 2లో

## చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నాం.. అందుకు ఈ పథకమే నిదర్శనం

- చీరాలలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం
- ఎన్నికల్లో చెప్పని హామీని కూడా నెరవేర్చామన్న ముఖ్యమంత్రి
- చేనేత వర్గాలకు అందిస్తున్న ఉచిత విద్యుత్, పెన్షన్ పథకాలను వివరించిన సీఎం
- చీరాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ

- మిగతా 2లో




## ప్రశాంత్ కిశోర్‌తో డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ భేటీ.. బీజేపీ సీరియస్ వార్నింగ్!

- ప్రశాంత్ కిశోర్‌తో భేటీ అయిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం సునేత్ర పవార్
- ముంబైలోని ఆమె నివాసంలో గంటలపాటు సాగిన రహస్య చర్చలు
- కూటమిలో చీలికలు తెచ్చే పనులు చేయవద్దని బీజేపీ నేత హెచ్చరిక
- పార్టీ బలోపేతం కోసమే భేటీ అని స్పష్టం చేసిన ఎన్సీపీ వర్గాలు



**పెన్ పవర్ డెస్క్:**మహారాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఎన్సీపీ అధినేత్రి సునేత్ర పవార్ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో సమావేశం కావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై అధికార మహా యుతి కూటమిలోని బీజేపీ స్పందించింది. కూటమిలో అనుమానాలకు, విభేదాలకు తావిచ్చే చర్యలకు పాల్పడవద్దని మిత్రపక్షమైన ఎన్సీపీకి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది. ముంబైలోని సునేత్ర పవార్ అధికారిక నివాసం 'దేవగిరి'లో గురువారం ఈ భేటీ జరిగింది. ఆమె కుమారుడు,

- మిగతా 2లో



## ఈ నెల 11 లోపు కృష్ణా నీటిని విడుదల చేయకపోతే నార్లాపూర్ ను ముట్టడిస్తాం

### నిరంజన్ రెడ్డి హెచ్చరిక

- నీళ్లు లేవంటూ రైతులను రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారన్న నిరంజన్ రెడ్డి
- ఏపీకి నీళ్లు తరలించేందుకు చంద్రబాబుకు సహకరిస్తున్నారని ఆరోపణ
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పక్కన పెట్టేశారని మండిపాటు

**పెన్ పవర్ డెస్క్:**జూరాల ప్రాజెక్టు పరిధిలోని భీమా ఫేజ్-1, 2, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ లిఫ్టులతో పాటు కేఎల్ఐ కింద ఉన్న పంపులను తక్షణమే ప్రారం భించి పాలమూరు

- మిగతా 2లో

## ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు మా అంతర్గత విషయం: అమెరికాకు భారత్ గట్టి కౌంటర్

- ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై అమెరికా ఎంపీ వ్యాఖ్యలను ఖండించిన భారత్
- ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేసిన విదేశాంగ శాఖ
- విదేశీ నిధుల నియంత్రణపై అమెరికాలోనూ చట్టాలున్నాయని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు-2026 (FCRA)పై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు చేసిన విమర్శలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని,

- మిగతా 2లో

## భయపడొద్దు, నేనున్నాను: టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

- ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్
- టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని
- "ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా
- పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

- మిగతా 2లో

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.





## హర్మూజ్ సంక్షోభం వచ్చినా... ఒక్క పెట్రోల్ బంక్ కూడా మూతపడలేదు

- హర్మూజ్ జలసంధి సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొందన్న మంత్రి
- దేశంలో ఎక్కడా ఇంధన కొరత తలెత్తలేదని తెలిపిన కేంద్రమంత్రి పురి
- ముడిచమురు దిగుమతులను 41 దేశాలకు విస్తరించామని వెల్లడి
- భారత్‌కు అతిపెద్ద ఎల్పీజీ సరఫరాదారుగా నిలిచిన అమెరికా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### లోకేష్ పొగడ్తల వెనుక కథ ఏంటీ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన అంశం.. మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కురిపిస్తున్న ప్రశంసల వర్షం. మైక్ దొరికినా, డిజిటల్ వేదికలైనా సరే.. అక్కడ స్పేస్ లేకపోయినా సరే.. స్పేస్ సృష్టించుకుని మరీ పవన్‌పై లోకేష్ ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే, ఈ పరిణామంపై తెలుగుదేశం పార్టీకి చెందిన కొంతమంది సోషల్ మీడియా కార్యకర్తల్లో అంతర్గతంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సొంత పార్టీ కార్యకర్తలు తమ ఉనికి కోసం పోరాడుతుంటే, నేత మాత్రం మిత్రపక్ష నాయకుడికి ఈ స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటనే చర్చ నడుస్తోందిఈ అసంతృప్తి వెనుక ప్రధానంగా సోషల్ మీడియా పంచాయతీలు అతిపెద్ద కారణంగా కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా డిజిటల్ స్పేస్‌లో టీడీపీ, జనసేన సోషల్ మీడియా సైన్యాల మధ్య నిరంతరం తీవ్రమైన వార్ నడుస్తూనే ఉంటుంది. ఒక పార్టీ పోస్ట్‌లకు మరొక పార్టీ కౌంటర్లు ఇస్తూ, క్రెడిట్ వార్ నడుపుతుంటారు. సహజంగానే టీడీపీ సోషల్ మీడియా విభాగానికి ఆద్యుడు, మార్గదర్శకుడు నారా లోకేష్ అనే భావన శ్రేణుల్లో బలంగా ఉంది. తాము సైబర్ యుద్ధం చేస్తుంటే, తమ నాయకుడే పవన్ కల్యాణ్‌ను అభినందిస్తూ పోస్టులు పెట్టడం, ఆయనను అనవసరంగా హైలైట్ చేస్తున్నారని భావించే కొంతమంది సోషల్ మీడియా శ్రేణులు నిరాశకు గురవుతున్నాయి.అయితే, సోషల్ మీడియా విభేదాలకు విరుద్ధంగా నారా లోకేష్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న దాడి, సైబర్ యుద్ధాల వెనుక తన ప్రమేయం లేదని, కూటమి ఐక్యతకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేయడమే లోకేష్ ప్రధాన ఉద్దేశం. పార్టీల మధ్య మైండ్ గేమ్‌లు, శ్రేణుల మధ్య విభేదాలను అణచివేయకపోతే అది ప్రభుత్వ మనుగడకే ప్రమాదకరమని గ్రహించిన లోకేష్, పవన్‌తో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని, గౌరవాన్ని బహిరంగంగా చాటుకోవడం ద్వారా గ్రౌండ్ లెవల్‌లోని సోషల్ మీడియా సైనికులకు ఒక పరోక్ష హెచ్చరిక సగటు సందేశంగా పంపుతున్నారు.రాజకీయాల్లో పొత్తులను సుదీర్ఘకాలం నడపడం, భాగస్వామ్య పక్షాల మధ్య ఎలాంటి మిస్ అండర్‌స్టాండింగ్స్ రాకుండా చూసుకోవడం కత్తిమీద సాము వంటిదే. గత అనుభవాలతో చిన్నపాటి కమ్యూనికేషన్ గ్యాప్ కూడా ప్రత్యర్థి పార్టీ అయిన వైఎస్సార్‌సీపీకి రాజకీయంగా లాభిస్తుందనేది కూటమి పెద్దల వ్యూహం. చంద్రబాబు నాయుడు అరెస్ట్ అయిన సమయంలో పవన్ కల్యాణ్ చూపించిన చొరవ, ధైర్యాన్ని లోకేష్ తరచూ గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతా భావాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ పొగడ్త మాత్రమే కాకుండా, విశ్వసనీయతను కాపాడుకునే ప్రక్రియ. మరో కీలకమైన అంశం ఏమిటంటే, కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ ఇమేజ్ అత్యంత ప్రాధాన్యమైనవి. చంద్రబాబు తర్వాత టీడీపీకి లోకేష్ భావి నాయకుడిగా ఎదిగే క్రమంలో.. జనసేనానితో సత్సంబంధాలు కాపాడుకోవడం భవిష్యత్ రాజకీయ స్థిరత్వానికి చాలా అవసరం. టీడీపీ కార్యకర్తలను, సోషల్ మీడియా యోధులను ఎంతమాత్రం విస్మరించకుండానే, పవన్ కళ్యాణ్ గౌరవానికి ఎక్కడా భంగం వాటిల్లకుండా లోకేష్ అడుగులు వేస్తున్నారు. శ్రేణుల మధ్య పోటీ తత్వం సహజమే అయినా, కూటమి ధర్మాన్ని నిలబెట్టుకోవడమే ప్రాథమిక లక్ష్యమని చాటడం ఇందులో అంతర్లీన వ్యూహం.నారా లోకేష్ అనుసరిస్తున్న ఈ పొగడ్తల వ్యూహం కేవలం వ్యక్తిగత అభిమానం కాక, ఒక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో జరుగుతున్న చిన్నచిన్న పంచాయతీలను పక్కన పెట్టి, కూటమి బంధాన్ని మరింత బలోపేతం చేయడమే ఏపీ ప్రభుత్వ స్థిరత్వానికి మూలస్తంభమని లోకేష్ స్పష్టం చేస్తున్నారు. కార్యకర్తల అసంతృప్తి తాత్కాలికమే అయినా, కూటమి మైత్రి నిలబడితేనే అధికారం సుస్థిరంగా ఉంటుందనే సందేశాన్ని ఆయన డిజిటల్ .రాజకీయ వేదికల ద్వారా సమర్థవంతంగా అందిస్తున్నారని అనుకోవచ్చు.

### తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష నెరవేర్చిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి
పలకరిం చడంతో పాటు, మగ్గంపై తన చిత్రాన్ని నేసిన చేనేత దంపతులను అభినందించారు. ఈ రెండు సంఘటనలు ఆయన పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.వివరాల్లోకి వెళితే, చీరాలకు చెందిన 90 ఏళ్ల పుష్పావతి అనే వృద్ధురాలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒక ఫోటో దిగాలన్న తన చిరకాల వాంఛను సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తం చేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. తన చీరాల పర్యటనలో తప్పకుండా కలుస్తానని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, పర్యటన సందర్భంగా పుష్పావతిని ప్రత్యేకంగా పిలిపించి ఆప్యాయంగా మాట్లాడారు. ఆమెతో కలిసి ఫోటో దిగి ఆమె కోరికను నెరవేర్చారు. సీఎం తనను గుర్తుపెట్టుకుని పిలిచి మాట్లాడటంతో ఆ వృద్ధురాలు ఆనందంతో అబ్బురపడ్డారు.అదేవిధంగా, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు కూడా ముఖ్యమంత్రిని కలిశారు. వారు ఎంతో నైపుణ్యంతో మగ్గంపై వస్త్రం రూపంలో చంద్రబాబు చిత్రపటాన్ని నేశారు. వారి కళా ప్రతిభను చూసి ముగ్ధుడైన ముఖ్యమంత్రి, ఆ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. వారి నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ ప్రోత్సాహం అందించారు. సామాన్యుల ఆకాంక్షలకు, కళాకారుల ప్రతిభకు సీఎం ఇస్తున్న విలువకు ఈ సంఘటనలు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నాం..

రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని, బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం కొత్తపేట గ్రామంలో 'నేతన్న సేవలో' అనే కొత్త పథకాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు రూ. 179 కోట్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకునే ఆగస్టు 7వ తేదీని మరపురాని రోజుగా మార్చాలనే సంకల్పంతో ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా, చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామనడానికి 'నేతన్న సేవలో' పథకమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది భారతీయ సంస్కృతికి, దేశం గర్వించదగ్గ కళకు ప్రతీక అని కొనియాడారు. ఒకప్పుడు చేనేత ఉత్పత్తులతో 'మినీ ముంబై'గా పేరుగాంచిన చీరాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేనేత వర్గాల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తోందని చంద్రబాబు వివరించారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ భరోసా కింద రూ. 4,000 పింఛను అందిస్తున్నామని, దీని ద్వారా 85 వేల మందికి ఏటా రూ. 420 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని, దీనివల్ల 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లు లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ. 79 కోట్లు అందించామన్నారు.
చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకెళుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ. 10 కోట్లతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం

తెలిపామని, హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమం ద్వారా కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నంలో రూ. 4,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ద్వారా చేనేత రంగానికి మరింత ఊపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

- మొదటి పేజీ తరువాయి
ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.
ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు.
1. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి.
2. ప్రస్తుతం రూ.9,000 కోట్లకు చేరిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
3. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున గత రెండేళ్ల బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి.
"చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఈ నెల 11 లోపు కృష్ణా నీటిని విడుదల చేయకపోతే నార్లాపూర్ ను ముట్టడిస్తాం

- మొదటి పేజీ తరువాయి
రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 11వ తేదీలోపు పంపులను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి భారీ సంఖ్యలో రైతులతో నార్లాపూర్ ప్రాజెక్టును ముట్టడిస్తామని హెచ్చరించారు.
కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ, నీళ్లు లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూనే ఏపీకి నీళ్లు తరలించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేవంత్ సహకరిస్తున్నారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించిన ఆయన... కర్ణాటక నుంచి వచ్చే వృథా నీటితోనే డిసెంబర్ వరకు జూరాలకు పుష్కలంగా నీరు అందుతుందని, వెంటనే ఎత్తిపోతల పంపులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

## ఎఫ్‌సీఆర్ఏ బిల్లు మా అంతర్గత విషయం: అమెరికాకు భారత్ గట్టి కౌంటర్

- మొదటి పేజీ తరువాయి
దీనిపై ఇతరుల వ్యాఖ్యలు అనవసరమని స్పష్టం చేసింది. విదేశీ నిధుల నియంత్రణకు సంబంధించి అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేసింది.
అమెరికాకు చెందిన రిపబ్లికన్ పార్టీ ప్రతినిధి రైలీ మూర్ ఆగస్టు 4న మాట్లాడుతూ, ఎఫ్‌సీఆర్ఏ బిల్లు క్రైస్తవులపై జరుగుతున్న స్పష్టమైన దాడి అని ఆరోపించారు. ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దయినా లేదా పునరుద్ధరణ జరగకపోయినా.. చర్చిలు, మతపరమైన స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకునే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
ఈ విమర్శలపై గురువారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. భారత్‌లో చట్టాల రూపకల్పనకు పటిష్ఠమైన
ప్రజాస్వామ్య ప్రక్రియ ఉందని, దేశీయ చట్టాలను సరైన కోణంలో అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు.
విదేశాల నుంచి వచ్చే విరాళాలను నియంత్రించే 2010 నాటి చట్టానికి సవరణలు చేస్తూ ప్రభుత్వం ఈ కొత్త బిల్లును ప్రతిపాదించింది. దీని ప్రకారం, ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దయిన లేదా గడువు ముగిసిన సంస్థల ఆస్తులను, విదేశీ విరాళాలను నిర్వహించడానికి ప్రభుత్వం నియమించిన అధికారికి అధికారాలు లభిస్తాయి. అయితే, ప్రార్థనా స్థలాల మతపరమైన స్వభావాన్ని యథాతథంగా కాపాడతామని ఈ బిల్లులో స్పష్టం చేశారు.

## భయపడొద్దు, నేనున్నాను:
### టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

- మొదటి పేజీ తరువాయి
ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు."ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం.. ప్రకటించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి
వారి ఖాతాల్లో జమ చేశారు. చేనేత వృత్తి భారతీయ సంస్కృతికి ప్రతీక అని, చేనేత కళాకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. గత పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నామని, పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రానికి 'బ్రాండ్ ఇమేజ్' తీసుకువస్తుంటే, కొందరు 'గొడ్డలి జనరేషన్' కుట్రలతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## హర్మూజ్ సంక్షోభం వచ్చినా... ఒక్క పెట్రోల్ బంక్ కూడా మూతపడలేదు

హర్మూజ్ జలసంధి వద్ద భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తినప్పటికీ, దేశంలో ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా భారత్ సమర్థవంతంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. ముడిచమురు దిగుమతులకు సంబంధించి ప్రత్యామ్నాయ దేశాలను అన్వేషించడం, దేశీయంగా ఉత్పత్తిని పెంచడంతో పాటు మౌలిక సదుపాయాల విస్తరణ వంటి వ్యూహాత్మక చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆయన వివరించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) వార్షిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.గతంలో భారత్ తన ముడిచమురు అవసరాలతో పాటు, 90 శాతం ఎల్పీజీ, 60 శాతం గ్యాస్ దిగుమతుల కోసం హర్మూజ్ జలసంధిపైనే అధికంగా ఆధారపడేదని మంత్రి గుర్తుచేశారు. సరఫరా వ్యవస్థలో ఆటంకాలు ఏర్పడిన తరుణంలో ప్రభుత్వం సత్వరమే స్పందించిందని ఆయన తెలిపారు. "దేశవ్యాప్తంగా ఉన్న 1,07,000 ఇంధన రిటైల్ అవుట్‌లెట్లలో ఒక్కటి కూడా నిల్వలు లేక మూతపడలేదని నేను గర్వంగా చెప్పగలను" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ముడిచమురు దిగుమతి చేసుకునే దేశాల సంఖ్యను గతంలో ఉన్న 27 నుంచి 41కి పెంచుకున్నామని పురి వెల్లడించారు. అలాగే 2014లో దేశంలో 52,000గా ఉన్న పెట్రోల్ బంకుల సంఖ్య నేడు 1,07,000కు పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం అమెరికా మన దేశానికి అతిపెద్ద ఎల్పీజీ సరఫరాదారుగా అవతరించిందని, మన మొత్తం దిగుమతుల్లో సుమారు 67 శాతం వాటా అక్కడి నుంచే వస్తోందని ఆయన పేర్కొన్నారు.సముద్ర గర్భంలో చమురు, సహజ వాయువు నిక్షేపాల అన్వేషణను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.84,000 కోట్ల వ్యయంతో చేపట్టిన 'సముద్ర మంథన్' కార్యక్రమానికి ఇటీవల ఆమోదం తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. ఇక ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఇ20) నాణ్యతపై వస్తున్న ఆందోళనలను ఆయన తోసిపుచ్చారు. అతికొద్ది ప్రాంతాల్లో మాత్రమే స్వల్ప ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో భవిష్యత్తులో తలెత్తే ఎలాంటి భౌగోళిక, రాజకీయ సవాళ్లనైనా భారత్ అధిగమించగలదని హర్దీప్ సింగ్ పురి ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో సురక్షితమైన, స్థిరమైన ప్రపంచ ఇంధన వ్యవస్థ ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

## పెరిగిన విద్యుత్ డిమాండ్.. 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కొనుగోలుకు ఏపీ కసరత్తు

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సుమారు 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను అదనంగా కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు నానాటికీ పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా వేసవి కాలంలో శీతలీకరణ ఉపకరణాల వాడకం అధికం కావడంతో గరిష్ఠ డిమాండ్ 15,000 మెగావాట్లు దాటింది. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా ఉండేందుకు ఏపీజెన్‌కో ఆధ్వర్యంలోని థర్మల్ ప్లాంట్లలో ఉత్పత్తిని పెంచడంతో పాటు ఓపెన్ మార్కెట్ నుంచి కూడా విద్యుత్ కొనుగోలు చేస్తున్నారు.ప్రస్తుతం రాష్ట్రానికి ఏపీపీడీసీఎల్ వంటి సంస్థలతో ఉన్న దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా థర్మల్ విద్యుత్ అందుతోంది. అయినప్పటికీ పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అదనపు కొనుగోళ్లు తప్పనిసరిగా మారాయి. విద్యుత్ కేంద్రాలకు బొగ్గు నిల్వల కొరత లేకుండా చూడటం, సరసమైన ధరలకే విద్యుత్ సేకరించడంపై ఇంధన శాఖ అధికారులు దృష్టి సారించారు.పునరుత్పాదక ఇంధన వనరుల సామర్థ్యాన్ని పెంచుతున్నప్పటికీ, నిరంతరాయ విద్యుత్ సరఫరాలో స్థిరత్వం (బేస్‌లోడ్) కోసం థర్మల్ విద్యుత్‌పై ఆధారపడటం ఎంతో కీలకమని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే అదనపు థర్మల్ విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది.

## ప్రశాంత్ కిశోర్‌తో డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ భేటీ.. బీజేపీ సీరియస్ వార్నింగ్!

- మొదటి పేజీ తరువాయి
ఎన్సీపీ నేత పార్థ్ పవార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గంటల తరబడి సాగిన ఈ చర్చల్లో పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై మంతనాలు జరిపినట్లు ఎన్సీపీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జనవరిలో తన భర్త, మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత సునేత్ర పవార్, ప్రశాంత్ కిశోర్‌తో భేటీ కావడం ఇది రెండోసారి.ఈ భేటీపై మహారాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ బవాన్‌కులే స్పందించారు. "కూటమిలో చీలికలు తెచ్చే ఎలాంటి చర్యలకు పూనుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ఇది ఎన్సీపీ అంతర్గత వ్యవహారమే అయినప్పటికీ, మహాయుతిలోని భాగస్వామ్య పక్షాలన్నీ కూటమి ధర్మానికి కట్టుబడి ఉండాలని, మిత్రపక్షాలను ఇబ్బంది పెట్టే పనులు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.ఇటీవల బీహార్‌లోని బంకిపుర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం గమనార్హం. గత మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న బంకిపూర్ నియోజకవర్గంలో ప్రశాంత్ కిశోర్ గెలుపొందిన నేపథ్యంలో, ఈ భేటీకి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపైనే చర్చించినట్లు ఎన్సీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# రోడ్డు నియమ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవు -పొదిలి సి ఐ రాజేష్

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 7**

రోడ్డు నియమ నిబంధనలను వాహనదారులు పాటించకపోతే అటువంటి వారిపై చర్యలు తప్పవని పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ హెచ్చరించారు. అదే గురువారం రాత్రి ఆయన వదిలి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో వాహనాల తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా సిఐ రాజేష్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సీఐ రాజేష్ హెచ్చరించారు.



ఈ కార్యక్రమంలో సిఐ రాజేష్ వెంట సిబ్బంది కూడా పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# 33 ఏళ్లుగా గ్రామీణుల గొంతుగా ఆకాశవాణి

## 101.5 ఎఫ్ ఎం నుంచి వాట్సాప్, ఫేస్బుక్ వరకు -సాంకేతికతతో ముందుకు ఓటిటితో అనుసంధానం

## ఎఫ్ఎం నుండి పరీక్షల శిక్షణ, కాలేజ్ క్యాంపస్ ప్రోగ్రామ్స్ అందుబాటులో

## కొత్త కార్యక్రమాలతో యువతను ఆకట్టుకునే ప్రణాళికలు



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 7**

ఉమ్మడి ఒంగోలు జిల్లా మార్కాపురంలో 1993 ఆగస్టు 9న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఆకాశవాణి ఎఫ్ ఎం కేంద్రం రేపటితో 33 సంవత్సరాలు పూర్తి చేసుకుంటోంది. గ్రామీణ ప్రాంతాలకు సమాచారం, వినోదం అందించాలనే లక్ష్యంతో మొదలైన ఈ కేంద్రం నేటికీ వేలాది మందికి తోడుగా నిలుస్తోంది.

**33 ఏళ్ల ప్రస్థానం...:** కోర్టు సెంటర్ సమీపంలో, ఒంగోలు రోడ్డులో ఉన్న ఈ కేంద్రం 101.5 ఎంహెచ్ జెడ్ ఫ్రీక్వెన్సీతో ప్రసారాలు అందిస్తోంది. స్థానిక వార్తలు, వ్యవసాయ సమాచారం, విద్యా కార్యక్రమాలు, జానపద గీతాలు, సినిమా పాటలతో గ్రామీణ ప్రజలకు దగ్గరైంది. రైతులకు పంటలపై సలహాలు, విద్యార్థులకు పోటీ పరీక్షల సమాచారం, మహిళలకు ఆరోగ్య చిట్కాలు - ఇలా ప్రతి వర్గానికి ఉపయోగపడే కార్యక్రమాలతో మార్కాపురంలోని ఆకాశవాణి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

**సాంకేతికతతో అడుగు ముందుకు...:** కాలంతో పాటు మారుతూ ప్రస్తుతం యువతకు అనుగుణంగా సోషల్ మీడియా వేదికలను కూడా వినియోగించుకుంటోంది. వాట్సాప్ గ్రూపులు, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ ట్విట్టర్ పేజీ ద్వారా కార్యక్రమాలను ప్రత్యక్షంగా, రికార్డెడ్ రూపంలో అందిస్తున్నారు. ఇప్పుడు అందరూ ఫోన్ లోనే ఉంటున్నారు. రేడియో వినలేని వారు కూడా మా ప్రోగ్రామ్స్ ను వాట్సాప్, ఫేస్బుక్ ద్వారా వినవచ్చు. త్వరలో మా సొంత యాప్ ను



డెవలప్ చేసి ప్రతిక్షణం ప్రోగ్రామ్స్ ను అందుబాటులోకి తెస్తాం అని అధికారులు తెలిపారు.

**కొత్త ప్రోగ్రాం కోఆర్డినేటర్ జీవన్ ప్రణాళికలు..:** కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రోగ్రాం విజిక్యూటివ్ జీవన్ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 33 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ కేంద్రాన్ని మరింత ప్రజాదరణ పొందేలా చేస్తాం. యువతకు నచ్చే కార్యక్రమాలు, స్థానిక కళాకారులకు అవకాశాలు, వ్యవసాయ, ఉపాధి అవకాశాలు, పోటీ పరీక్షల శిక్షణ, కాలేజీ క్యాంపస్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించినట్లు చెప్పారు. అంతేకాకుండా శ్రోతలతో ప్రత్యక్ష ఇంటరాక్షన్, ఫోన్-ఇన్ కార్యక్రమాలు, స్కూల్, కాలేజీ విద్యార్థుల కోసం ప్రత్యేక స్లాట్లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని వెల్లడించారు.

**శ్రోతల అభిప్రాయం..:** "సెల్ ఫోన్ లేని రోజుల్లో రేడియోనే మా వినోదం. ఇప్పటికీ ఉదయం 6 గంటల వార్తలు, సాయంత్రం వ్యవసాయ కార్యక్రమం తప్పకుండా వింటాం అని సీనియర్ జర్నలిస్ట్ రమణ చెప్పారు. ఎఫ్ఎం లో పాటలు, వాట్సాప్ లో ప్రోగ్రామ్ లింక్ రెండూ ఉంటే మా లాంటి వారికి చాలా ఉపయోగమని రమణ అన్నారు.

**భవిష్యత్ లక్ష్యం..:** 33 ఏళ్లుగా ప్రజలకు సేవ చేస్తున్న ఆకాశవాణి భవనాన్ని మెరుగుపరిచి, మరిన్ని స్టూడియోలు,




డిజిటల్ పరికరాలు ఏర్పాటు చేస్తే ప్రసారాల నాణ్యత మరింత పెరుగుతుందని శ్రోతలు ఆకాంక్షిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వారధిగా నిలుస్తున్న ఈ ఆకాశవాణి ఇప్పుడు డిజిటల్ యుగంలోకి అడుగుపెట్టి మరో 33 ఏళ్లు ముందుకు సాగేందుకు సిద్ధమవుతోంది.


# విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ కు అర్హత లేదు

## ఉమ్మడి జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు బూచేపల్లిశివప్రసాద్ రెడ్డి

## డియస్సి దగా డియస్సిగా మార్చింది లోకేష్.. ఎమ్మెల్యే తాటిపర్తి

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగష్టు 7**

డియస్సి పేరిట నిరుద్యోగ యువతకు మోసం చేసి దగా డియస్సి నిర్వహించి ఉద్యోగాలను టీడీపీ అనుయాయులకు, కార్యకర్తలకు అమ్ముకున్న నారా లోకేష్ ముఖ్యమంత్రి పదవిలో కూర్చునే అర్హత లేదని వెంటనే రాజీనామా చేయాలని వైస్సార్సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లిశివప్రసాద్ రెడ్డి అన్నారు. తండ్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాబట్టే నారా లోకేష్ విద్యా శాఖ మంత్రి అయ్యాడని, రాష్టంలో విద్యా శాఖను అబాసుపాలు చేసిన ఘనత నారా లోకేష్ కు దక్కిందన్నారు. జగనన్న హయాంలో విద్యా వ్యవస్థలో నాడు నేడు, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మవడి, మరెన్నో విప్లవత్మాక మార్పులు తెస్తే, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్,కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించుకున్న వారి ఉద్యోగాలను అక్రమంగా అమ్ముకుంటు డియస్సి లీకేజి వ్యాపారానికి తెరాలేపాడని విమర్శించారు. కేంద్రమంత్రి రాజీనామా చేసినట్లు లోకేష్ రాజీనామా చేయాలని, చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు ఇస్తానని ఓట్లు వేయించుకుని గద్దెనెక్కినాక మోసం చేసాడని, నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదని,ఒకరికైనా మూడు వేలు ఇచ్చావా అని ప్రశ్నించారు.వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి సారి డియస్సినిదగా డియస్సిగామార్చింది నారా లోకేష్ వ్యాపార ధనాశ అని, నిరుద్యోగుల శాపం తగలక తప్పదని అన్నారు. నీ పార్టీ కార్యకర్తల మీదా, నాయకుల మీద ప్రేమవుంటే పార్టీ పదవులు ఇచ్చుకోవాలి గాని డియస్సి రాసిన నిరుద్యోగుల భవిష్యత్తును లక్షలకు అమ్ముకోవడం దుర్మార్గం అని అన్నారు.డియస్సి పేపర్ లీకేజిపై సిబిసిఐ డి విచారణ చేపట్టాలని, దొంగ స్పోర్ట్స్ కోటను తొలగించి అర్హత సాధించిన డియస్సి విద్యార్థులకు ఉద్యోగఅవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.వ్యతిరేకిస్తూ జాతీయ రహదారిపై చేపట్టిన రెండవ రోజు రిలే నిరాహారదీక్షలో కూర్చున్న పుల్లలచెరువు, పెద్దరావీడు నాయకులను ఎమ్మెల్యే లు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ లు అభినందనలు తెలిపి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్సార్సీపీ ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తిరెడ్డి, జడ్పీటీసీ చేదురి విజయ భాస్కర్,జిల్లా ఐటీవింగ్ అధ్యక్షులు నాగేశ్వర రెడ్డి, అయిదు మండలాల అధ్యక్షులు ఏకుల ముసలా రెడ్డి, గంట వెంకట రమణారెడ్డి,దోమకాల వెంకటేశ్వర్లు, కృష్ణ రెడ్డి,పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాథ్,యంపీపీ ఆళ్ళ ఆంజినేయరెడ్డి, నాయకులు ఆళ్ళ కృష్ణరెడ్డి,ఓబుల్ రెడ్డి మైనార్టీ నాయకులు సయ్యద్ బుజ్జి, సయ్యద్ జబివుల్లా,షేక్ మునాఫ్, షేక్ బాబు, వైశ్య నాయకులు ఐవి సుబ్బారావు, కందూరిగురు, యక్కలి రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.






# ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**అర్ధవీడు, పెన్ పవర్, ఆగష్టు 7**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఒక నెల -- ఒక నియోజకవర్గం - నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా, గిద్దలూరు నియోజకవర్గం అర్ధవీడు మండల ఎంపిడిఓ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత , జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డీఓ ఎం. వెంకట శివరామిరెడ్డి గారి తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వయంగా స్వీకరించారు. ప్రజలు వినిపించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# కల్తీ బియ్యం రంగ ప్రవేశం.. జర జాగ్రత్త..!

- బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి
- సన్న బియ్యం పేరుతో వ్యాపారులు ఘరానా మోసం
- ఫుడ్ సేఫ్టీ , తూనికల కొలతల అధికారులు ఎక్కడ..!
- రేషన్ బియ్యం విక్రయ వ్యాపార సంస్థల వద్ద బోర్డు ఉండదు తగ్గేదేలే అంటున్నారు
- అధికారులు తక్షణమే వ్యాపార సంస్థలపై దృష్టి సారించండి
- పలు రకాల పేర్లతో విక్రయాలు
- నిలువునా మోసపోతున్న వినియోగ దారులు
- 25 కిలోల బస్తా రూ. 1700 పైగా విక్రయాలు



**పెన్ పవర్, కంభం ఆగస్టు 7**

బియ్యం ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి అడిగే వారు లేరు వ్యాపారులు పట్టించుకోరు తగ్గేదేలే తాము చెప్పిందే ధరలు అంటున్నారు. మార్కెట్లో వినియోగదారుల పాలిట శాపంగా కల్తీ బియ్యం రంగ ప్రవేశం చేశాయి. వినియోగదారులు కొనేముందు జర జాగ్రత్త .ఒక్కసారిగా బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి సన్న బియ్యం మరింత ప్రియాంగ మార్చేశారు వ్యాపారులు. అవకాశమే హద్దుగా ధరలను ఒక్కసారిగా పెంచడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 4 నెలల క్రితం 25 కేజీల సన్న బియ్యం ధర రూ 1200 వందలు ఉండగా అదనంగా మరో రెండు వందల పెంచి 16 వందలు నుండి 1700 వందల వరకు విక్రయాలు చేస్తున్నారు. వ్యాపార సంస్థల వద్ద బోర్డు ఉండదు. గుర్తించేవారు అసలు ఉండరు తక్షణమే అధికారులు దాడులు నిర్వహించి కల్తీ బియ్యం స్వాధీనం చేసుకోవాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. నంద్యాల కర్నూలు ప్రాంతాలను పోల్చుకుంటే ఇక్కడ ధరలు ఎక్కువ కనిపిస్తున్నాయి. కంభం పట్టణంలో బియ్యం వ్యాపారులు నాణ్యమైన బియ్యం పొంతన లేకుండా విక్రయాలు చేస్తున్నారు. కల్తీ బియ్యం రంగ ప్రవేశం చేసినట్లు సమాచారం. బ్రాండెడ్ సంచులు చూపి నిలువునా దోపిడీ చేస్తున్నారు. నిలకడగా ఉండే బియ్యం రేట్లు పెరగడంతో సామాన్యుల నెత్తిన పిడుగు పడినట్లు అయింది. సామాన్య మధ్య తరగతి కుటుంబాలు సన్నబియానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి ప్రతి మిల్లు లో ఏదో ఒక పేరుతో 25 కిలోల బ్యాగులను అందుబాటులో ఉంచుతున్నారు. రిటైల్ దుకాణాల వారు ఇష్టారాజ్యంగా పెంచేశారు. వినియోగదారులు ఒక్కసారిగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం ధరలకు జీఎస్టీ కూడా వర్తిస్తున్నా అవేమీ పట్టనట్లు వ్యాపారులు వ్యవహరించడంపై ఆశ్చర్య కరంగా ఉంది. వాస్తవానికి కొంతమందికి లైసెన్సులు కూడా లేకుండా రిటైల్ వ్యాపారం చేస్తున్నారు. ఈ ప్రాంత వాసులు సన్నబియానికి అలవాటు పడిపోయారు. కానీ బియ్యం ధరలు చూస్తే అధికంగా ఉన్నాయి. తాజాగా జీఎస్టీ ముసుగులో మరింత పెంచేశారు తగ్గించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే సామాన్యులు సన్నబియ్యం కొనుగోలు చేయలేరు. అనేక గ్రామాల వారు నిత్యం సరుకుల కొనుగోలుకు కంభం పట్టణానికి రావాల్సి ఉంది. నిత్యంఅవసరమైన బియ్యం ధరలు ఒకసారిగా పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అనేకమంది రిటైల్ వ్యాపారులు ఎవరికి తగ్గట్టు వారు బిల్లులు ఇవ్వకుండానే వ్యాపారాలు చేస్తున్నారు. తనిఖీ అధికారులు ఏనాడు కూడా కన్నెత్తి చూడకపోవడంతో బియ్యం వ్యాపారులను తనిఖీ చేసిన పాపాన పోలేదు. వ్యాపారాలు ఇచ్చిందే నమ్మకం అలాంటిది ఇప్పుడు ఎవరు చెప్పినా నమ్మే పరిస్థితిలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ తూనికల కొలతలు సంబంధిత అధికారులు దృష్టి సారించి తనిఖీలు చేసి అధిక ధరలను నియంత్రించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

# డీఎస్సీ-2025 అక్రమాలపై వైసిపి రిలే నిరాహార దీక్షలు

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 7:**

కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ--2025 టీచర్ పోస్టుల నియామకాల్లో జరిగిన అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు సబ్ - కలెక్టర్ కార్యాలయం ఎదురుగా రెండో రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు.మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దీక్షల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత, డీఎస్సీలో అన్యాయానికి గురైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, డీఎస్సీ--2025 నియామక ప్రక్రియలో జరిగిన అక్రమాలు రాష్ట్రంలోని నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడే చర్యలని విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే విద్య మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేసి సిబిఐ ఎంక్వయిరీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా పారదర్శకమైన చర్యలు చేపట్టాలని కోరారు. రెండవ రోజు జరిగిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో తాటిపర్తి రమేష్, చిట్యాల అనీల్, గారపాటి మహేంద్ర, కోసూరి దిలీప్, చల్లా.శశి, ఈమని మహేష్, కాకు పూర్ణేష్, గోళ్ళ అఖిల్, డబ్బుకొట్టు కాలేశాయాదవ్, నక్కల.శరత్, కాట్రగడ్డ వెంకట్రావు, బిల్లా రమణయ్య, మారబోయిన శ్రీరాములు, చల్లా.విగ్నేష్, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఉండేలా ఆదినారాయణ రెడ్డి,



కల్లగుంట ప్రసాదు, కిన్నెర హరిచంద్ర, ఎర్రగర్ల నర్సింగరావు,అబ్దుల్ కలాం, కాపులూరి మధుసూదన్, ముడసల. అరవ్, ఎర్రమల రాజా, గంగాడి కొండయ్య, సయ్యద్ షరీఫ్, షేక్ రిజ్వాన్,వంకాయలపాటి రవీంద్రబాబు,కొత్త గొర్ల వసంత లక్ష్మి, తుళ్లూరి ఆదిలక్ష్మి, జంపని అనురాధ, దాసరి సురేష్, ముడసల రాము, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.ఈ రిలే నిరాహార దీక్షల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు, డీఎస్సీ అభ్యర్థులు, అభిమానులు తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రిలే నిరాహార దీక్షకు అనుమతులు ఉన్నప్పటికీ పోలీసు వారు గుడారాలు వేసుకోకుండా అడ్డుకోవడం వలన విద్యార్థులు యువజనులు డీఎస్సీ అభ్యర్థులు తీవ్రమైన ఎండలోనే తమ దీక్షను కొనసాగించారు. ఎండ ప్రభావాన్ని తట్టుకుంటూనే గొడుగులను వేసుకొని చివరిదాకా దీక్షను కొనసాగించారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు



మండల అధ్యక్షులు ఈదర రమేష్, లింగసముద్రం అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్ రెడ్డి, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు,తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, చీమల వెంకటరాజా,బద్దిపూడి జయరావు,పేయ్యాల రమేష్ యాదవ్, ఎంపీపీ పులి రమేష్,ఎంపీపీ పెన్నా క్రిష్టయ్య, నలమోతు చంద్రమౌళి, ఉచ్చులూరి రవీంద్ర, చెరుకూరి బ్రహ్మయ్య, గేరా మనోహర్, అమ్మనబ్రోలు వెంగళరావు, ఆవుల మాధవరావు, చీమల శ్రీనివాసులు, మర్లపాటి ఆదామ్, కొమ్మి పోతులూరయ్య చిమ్మిలి వేణుగోపాల్, చిమ్మిలి మాధవరావు,సవలం కృష్ణ,షేక్ రహీం, ఎల్లావుల మాధవరావు, కన్నె రాజారావు, వట్టికుంట వెంకటేశ్వర్లు,దుర్గబాబు,దాసరి రవి, షేక్ ముజిబుల్ రెహమాన్, నక్కా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. దీక్షలో పాల్గొన్న డీఎస్సీ అభ్యర్థులు,విద్యార్థులకు సీనియర్ నాయకులు తోకల కొండయ్య, రావులకొల్లు బ్రహ్మానందం, మర్లపాటి ఆదాము, పెన్నా కృష్ణయ్య నిమ్మరసం అందించి దీక్షను విరమింప చేశారు.

## నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ దంపతులు





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 7**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ హైదరాబాదులో వారి నివాసమందు ఈరోజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి శ్రీకాంత్ దంపతులను ఆప్యాయంగా పలకరించి క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ని కలవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

## బిడ్డ పుట్టినవెంటనే మొదటి గంటలోపు ముర్రుపాలు పట్టాలి

**ముర్రు పాలను పట్టినట్లైతే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది**



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**

గిద్దలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కొంగలవీడు ఎస్టీ కాలనీ అంగన్వాడి సెంటర్ లో సూపర్వైజర్ బి జ్యోతి అధ్యక్షతన తల్లిపాల వారోత్స వాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు బాలింతలకి తల్లిపాల ప్రాముఖ్యత , బిడ్డ పుట్టిన వెంటనే మొదటి గంటలోపు ముర్రుపాలు పట్టాలని ముర్రుపాలల్లో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని ముర్రుపాలను పట్టినట్లయితే పిల్లల్లో వ్యాధి నిరోధకత ఎక్కువగా ఉంటుందని తెలియపరచారు. పిల్లలకు మొదటి టీకా అని తెలియజేశారు . 6 నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాలని ఏడో నెల నుండి తల్లిపాలతో పాటు అనుబంధ పోషక ఆహారం పిల్లలకు ఇవ్వాలని తెలియజేశారు పరిశుభ్రతల గురించి గర్భవతులు బాలింతలు తీసుకోవలసిన ఆహారం గురించి తెలిపారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు తల్లులు పాల్గొన్నారు.

## దానా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అమడసాని బాలకేశవరెడ్డి

**సి ఎస్ పురం , పెన్ పవర్ ఆగస్టు 7**

మండలంలోని కోవిలంపాడు స్వర్ణ గ్రామ కార్యాలయంలో శుక్రవారం పశుపోషకులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పశు దానా పంపిణీ కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మండల టీడీపీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్ సూచనలతో గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి పాల్గొని సంబంధిత అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు దానాను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులు, పశుపోషకుల సంక్షేమ అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పశుసంపద అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్సిడీపై పశు దానాను అందిస్తోందని, అర్హులైన పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి మోహన్ రెడ్డి, నారాయణస్వామి దేవస్థాన కమిటీ మాజీ సభ్యులు పాలపర్తి నారాయణరావు, పునుగుపాటి వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్, చందలూరి బాలకాశయ్య, షేక్ ఖలీల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ పనుల్లో శాస్త్రీయ సూచనలను పాటించాలి

**వ్యవసాయాధికారి పి మధుబాబు**





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 7**

ఎల్నినో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఈ సీజన్లో వర్షపాతం అసమానంగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ పనుల్లో శాస్త్రీయ సూచనలను పాటించాలని వ్యవసాయాధికారి పి. మధుబాబు తెలిపారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం లో శుక్రవారం ఎల్నినో పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి మధుబాబు పాల్గొని మాట్లాడుతూఎల్నినో ప్రభావం వల్ల రుతుపవనాలు బలహీనపడటం, దీర్ఘకాలిక పొడి వాతావరణం , అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వరి,మొక్కజొన్న, కంది, మినుము తదితర ఖరీఫ్ పంటల పెరుగుదలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవాలని తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని , నీటి పొదుపు పద్ధతులు అమలు చేయడం, మల్చింగ్, సూక్ష్మ సేద్యం వంటి సాంకేతికతలను వినియోగించడం అవసరమని వ్యవసాయ శాఖ, రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, తెగుళ్లు--చీడపీడల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ కార్యకలాపాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. పంటలు వేసిన రైతులు ఆగష్టు 15 లోపు పంటల బీమా ని నమోదు చేసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మీడియేషన్ ఫర్ నేషన్ 3.0 పై అవగాహన..






**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశముల మేరకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించటానికై ఈనెల 1. నుండి 7. వరకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గిద్దలూరు కోర్టుల ప్రాంగణం నుండి చేపట్టిన మోటార్ సైకిళ్ల ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ వరకు 1ని నడక ర్యాలీ గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ వరకు న్యాయవాది పి.లావణ్య జెండా ఊపగా ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె. భరత్ చంద్ర ప్రారంభించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా వివాదములను శీఘ్రగతిన పరిష్కరించుకోవచ్చని, తద్వారా కక్షిదారులకు సమయము ,ఖర్చు ఆదా అవటమే కాక కేసులు సులభంగా, ఉచితముగా పరిష్కరించుకోవచ్చని, ఇరుపక్షాల సమ్మతిమేరకు రాజీ నిబంధనలు ఏర్పాటు చేసుకోవచ్చని, కావున ఇరు పార్టీలు, కేసులు గెలిచినట్లేనని తెలియజేశారు .అన్ని రకముల సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఇరు పార్టీలు మధ్యవర్తిత్వంతో తెలియజేసిన విషయాలను రహస్యముగా ఉంచడం జరుగుతుందని, కాబట్టి కక్షిదారులు భయపడవలసిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.ఎన్. శేషశైనా రెడ్డి, కార్యదర్శి బి.ఐజాక్, ట్రెజరర్ ఎస్.కె. ఫాజిల్,లైబ్రేరియన్. ఎంఏ. రైడర్ బాబు ,అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది ఎం. రంగారెడ్డి, న్యాయవాదులు కె.రవి ప్రకాష్ బాబు, బి. ప్రకాష్, ఎం. పిచ్చయ్య, డి.సిద్దయ్య, బి .కేశవ, వి.వి.ఎన్. సుధీర్ కుమార్, బి. రాజ్ కుమార్ నాయక్, గిద్దలూరు అర్బన్ ఇన్స్పెక్టర్ కె. సురేష్ ,పోలీస్ సిబ్బంది, న్యాయవాది గుమస్తాల సంఘ సభ్యులు ఎస్. ఉదయ్ , కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

## గోపానిపల్లెలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం

**కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ.**





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 7**

కొమరోలు మండలం కొమరోలు పంచాయతీలోని గోపానిపల్లి గ్రామంలో శుక్రవారం కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ముమ్మరంగా సాగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల మేరకు కొమరోలు సహకార సంఘం చైర్మన్ ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు శనివారం గోపాలపల్లి గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టి వాటి గురించి ప్రజలకు వివరించారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి, ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి, పడి దెబ్బచెరువు ఆయకట్టుదారుల సంఘం చైర్మన్ వీరం రెడ్డి శివరామిరెడ్డి,కొమరోలు మండలం తెలుగుదేశం పార్టీ కోకన్వీనర్ ముత్తుముల ఎల్లారెడ్డి, కొమరోలు మాజీ వార్డ్ మెంబర్ షేక్ సుభాని, యువ నాయకులు కరీముల్లా,కాశి, బుజ్జి, నెల్లూరు సుభాని, అబ్దుల్ ఖాదర్, ఖాదర్ భాషా తదితర నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటిసమస్యలపై మునిసిపల్ కమిషనర్‌కు వినతి బిజెపి నాయకులు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**

గిద్దలూరు పట్టణం లో జనతా వారధి కార్యక్రమం - తాగునీటి సమస్యలపై మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గిద్దలూరు నియోజకవర్గంలోని గిద్దలూరు పట్టణంలో నేడు "జనతా వారధి" కార్యక్రమాన్ని గిద్దలూరు టౌన్ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం గిద్దలూరు మునిసిపల్ కమిషనర్ రమణ బాబు ను కలిసి, గిద్దలూరు మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను విన్నవించారు. మునిసిపల్ కమిషనర్ రమణ బాబు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తూ, జనతా వారధి కార్యక్రమంలో లేవనెత్తిన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా జనరల్ సెక్రటరీ డాక్టర్ జేవీ నారాయణ, ముప్పూరి శ్రీనివాసులు, బిజెపి నాయకులు సీనియర్ నాయకులు ప్రవీణ్ గౌడ్, కోప్పరపు నాగేశ్వరావు టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్సీ మోర్చా నాయకులు మాటేమల్లపుల్లయ్య, బీజేపీ నాయకులు రామకృష్ణ, టౌన్ వైస్ ప్రెసిడెంట్ బిజెపి సీనియర్ నాయకులు రవి, మండల ఓబీసీ నాయకులు కొప్పుల నరసింహులు, నెమలిగుండ్ల రంగస్వామి బోర్డు మెంబర్ టౌన్ ఓబీసీ అధ్యక్షులు జనార్ధన్, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఎన్. వీరచక్రం బిజెపి నాయకులు వెంకటేశ్వర్లు . బిజెపి నాయకులు రమేష్ .పాల్గొన్నారు.

## నేడు కొమరోలు మండలంలోని 12 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**అల్లినగరం సబ్స్టేషన్ పరిధిలోని నాలుగు గ్రామాలకు రెడ్డి చర్ల సబ్స్టేషన్ పరిధిలోని 8 గ్రామాలకు సరఫరా**



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 7**

కొమరోలు మండలంలోని 12 గ్రామాలకు ఈనెల 8 వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. కొమరోలు లోని విద్యుత్ సబ్స్టేషన్లో ఏర్పడిన సాంకేతిక లోపాలను నివారించడంతోపాటు విద్యుత్ లైన్ల పై పెరిగి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు వీలుగా విద్యుత్ సరఫరాను నిలిపి వేయవలసి వస్తున్నధని ఆయన తెలిపారు. అల్లినగరం విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని అల్లీనగరం,ఎర్రగుంట్ల, వట్టివేపమాను పల్లె, తిమ్మారెడ్డిపల్లి గ్రామాలకు, రెడ్డి చర్ల సబ్స్టేషన్ పరిధిలోని రెడ్డి చర్ల, మూలపల్లి, మల్లారెడ్డిపల్లి, మిట్టమీదిపల్లి,బ్రాహ్మణపల్లి, మదవపల్లి,పామూరు పల్లి, ఎర్ర పల్లి,గోనేపల్లి గ్రామాలకు ఎనిమిదో తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన చెప్పారు. కావున విద్యుత్ వినియోగ దారులు విద్యుత్ శాఖకు సహకరించాలని శ్రీనివాసులు కోరారు.

# ఈశాన్య రుతుపవనాలు ఆశాజనకంగా ఉండేవి

## రైతులు అప్రమత్తంగా ఉండాలి





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**

గిద్దలూరు మండలం దొడ్డం పల్లి, సంజీవరావు పేట, ముండ్లపాడు గ్రామాలలోని ఆచార్య ఎన్. జి రంగా విశ్వవిద్యాలయం, , గుంటూరు ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి ఎల్ నినో కంబాట్ టీమ్ కార్యక్రమంను రాష్ట్ర వ్యవసాయ విభాగం, వ్యవసాయ కళాశాల సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి శాస్త్రవేత్త డా.టి. వెంకటేశ్వర రెడ్డి ..ఎల్ నినో ప్రభావం వలన నైరుతి ఋతుపవనాలు మందగించి, తేలికపాటి జల్లులు, వర్షాల విరామం కారణంగా రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు అని, ఈ నెల 7 తేదీ లోపు నైరుతి రుతుపవనాల ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దానితో పాటు ఎత్తు గాలులు గంటకు 40-70 కిలోమీటర్ల వీస్తాయని, పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, 8-15 తారీఖు లోపు వర్షపాతం ఎక్కువగా నమోదవుతుందని, అలాగే ఈశాన్య ఋతు పవనాలు కూడా ఆశాజనకంగా ఉండవని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని , వేసుకునే పంటల విషయంలో కందిలో, జొన్న, ఆముదాలు అంతర పంటలగ వేసుకోవాలని, ఆగస్టు 15 తరువాత కూడా కంది పంట వేసుకోవాలని అంటే 36 అంగుళాలు దూరం ఉండేలా, మిరప , మొక్కజొన్న పంట నీటి వసతి బాగా ఉన్న ప్రాంతాలలో వేసుకోవాలని లేదా ఆ భూములలో మిరప , మొక్కజొన్న కుదరని పక్షంలో వరిగ, కొర్ర, జొన్న, మినుము పంటలను వేసుకోవాలని సూచించారు. ప్రత్తి పంటలో చీడపీడలు గురించి అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి, గిద్దలూరు విజయ భాస్కర్ రెడ్డి.వై పంటల భీమా యొక్క ప్రాముఖ్యత గురించి వివరించి ప్రతి ఒక్క రైతు పంట భీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామాలలోని పత్తి, ఆముదం, కంది పంటల క్షేత్ర పరిశీలన గావించి వాటిలో వచ్చే చీడపీడలు , వాటి నివారణ చర్యలు, వర్షభావ పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏం ఎస్ వ్యవసాయ కళాశాల, మార్కాపురం సిబ్బంది డా. కె లక్ష్మయ్య , డా. సి హెచ్ మహేశ్వర రెడ్డి , డా. జి. రజియా సుల్తానా, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి, గ్రామ ధీఘ్షెష్ట్రష్షు సహాయకులు దేవ శంకరమ్మ, మధు శంకర్, ఆత్మ సిబ్బంది వాణి , రైతులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉపాధ్యాయులు చిన్న ఖాదర్ వలీకి నివాళులర్పించిన వైసీపీ నేతలు.



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు7**


కొమరోలు పట్టణానికి చెందినమ రిటైర్డ్ ఉపాధ్యాయుడు షేక్ చిన్న ఖాదర్ వలీ మృతి పట్ల మండల వైసీపీ నేతలు విచారం వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కొమరోలు పట్టణానికి చెందిన ఇస్లాంపేటలోని టపా బావి వీధిలో నివాసం ఉంటున్న షేక్ చిన్న ఖాదర్ వలీ కొమరోలు మండలంలోని నల్లగుంట్లలో గల ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి గత మూడు ఏళ్ల క్రితం పదవి విరమణ చేశారు. కాగా ఖాదర్ వలీ గురువారం సాయంత్రం అనారోగ్యానికి గురై గిద్దలూరు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన మృత దేహాన్ని గురువారం రాత్రికి ఆయన స్వగృహానికి చేర్చారు. సమాచారం అందుకున్న కొమరోలు మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి, జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు,,మండల పరిషత్ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి, ఎంపీటీసీలు ఎస్ఎం సుభాని,ఎం తిరుపతి రాజు, మండల వైసీపీ కన్వీనర్ మేరీగ రవికుమార్,వైసీపీ జిల్లా ప్రచార కమిటీ సమన్వయకర్త చెదుల్ల వెంకటరమణారెడ్డి, మండల వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి ఆర్ పవన్ కళ్యాణ్ తదితర నేతలు శుక్రవారం ఉదయం ఖాదర్ వలీ నివాస గృహానికి వెళ్లి ఖాదర్ వలీ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ ధైర్యం చెప్పారు. ఖాదరవల్లి మంచి మనస్తత్వం కలవాడని, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది వారికి మంచి భవిష్యత్తు కల్పించారని అంటూ, ఆయన కుటుంబ సభ్యులు ఈ దుఃఖం నుంచి త్వరగా కోలుకోవాలని వారు భగవంతుని ప్రార్థించారు.

# ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 7**

సంతమాగులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం నిర్వహిస్తున్నట్లు పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మక్కిన బ్రహ్మయ్య తెలిపారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఇప్పటివరకు రూ.6.11 లక్షల నిధులు సమకూరాయని, ఈ పనులను ప్రత్యక్షంగా వీక్షించి పూర్వ విద్యార్థులు మరింత సహకారం అందించేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని పేర్కొన్నారు. పాఠశాల క్రీడా ఉపాధ్యాయుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో, కమిటీ అధ్యక్షుడు మక్కిన బ్రహ్మయ్య పర్యవేక్షణలో రిటైర్డ్ ఏఎస్ఐ అట్లా మోహన్‌రెడ్డి, ప్రముఖ రంగస్థల కళాకారుడు అట్లా శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పరిమి కోటేశ్వరరావు, కుర్ర అంజయ్య తదితర పూర్వ విద్యార్థులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 1965 నుంచి ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరూ కార్యక్రమానికి హాజరై పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం, సూచనలు అందించాలని మక్కిన బ్రహ్మయ్య విజ్ఞప్తి చేశారు.



# నేడు కొమరోలులో వైసీపీ నేతల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

### డీఎస్సీ లో జరిగిన అక్రమాలకు నిరసన గా దీక్షలో నిర్వహణ







**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 7**

కొమరోలు పట్టణంలో ఈ నెల 8వ తేదీ శనివారం గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లుగా కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు, కొమరోలు మండల వైసీపీ కన్వీనర్ మేరీగ రవికుమార్, కొమరోలు మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెండ్ల వెంగయ్య చౌదరి తెలిపారు. డీఎస్సీ లో జరిగిన అక్రమాలపై సిబిఐతో విచారణ జరిపించాలని, విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన బిల్లు చెల్లించాలని,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయలు చొప్పున బకాయిలతో సహా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వైసీపీ అధినాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో కొమరోలు లో ఈనెల 8వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని వారు తెలిపారు. నిరాహార దీక్షా శిబిరంలో 80 మంది నుంచి 100 మంది వరకు పాల్గొననున్నారని, ఆ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. నిరాహార దీక్ష కార్యక్రమానికి కుందూరు నాగార్జున రెడ్డితో పాటు గిద్దలూరు నియోజకవర్గంలోని పలు మండలాలు చెందిన వైసిపి నేతలు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని వారు తెలిపారు. కావున మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన వైసీపీ నేతలు,కార్యకర్తలు, అభిమానులు, నిరుద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై నిరాహార దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల పరిషత్ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి, ఎంపీటీసీలు ఎస్ ఎం సుభాని,ఎన్ తిరుపతి రాజు, జాజం వెంకటరమణ,సారే సుజాత, జిల్లా వైసీపీ ప్రచార కమిటీ సమన్వయకర్త చెదుల్ల రమణారెడ్డి, జిల్లా వైసీపీ బీసీ విభాగం కన్వీనర్ సారే జనార్దన్ నాయుడు,వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి ఆర్ పవన్ కళ్యాణ్, పలువురు మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక బీజేపి పాలన నశించాలి

### సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం -సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కె.వి కృష్ణ గౌడ్

### వెలుగొండ పూర్తి చేయాలి -ఆర్ఆర్ ప్యాకేజీ విడుదల చేయాలి

**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్టు 7**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మార్పు కావాలి అనే నినాదంతో సెప్టెంబర్ ఒకటో తారీకున చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ మండల కార్యదర్శి జి వి గురునాథం ఆధ్వర్యంలో శుక్రవారం జీపు యాత్రను చేపట్టారు. ఆగస్టు 13వ తేదీ యర్రగొండపాలెంలో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. పుల్లలచెరువు మండలంలో శుక్రవారం నాడు సిపిఐ ఆధ్వర్యంలో జీపు యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కెవి కృష్ణగౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద జీపుయాత్రలో భాగంగా మార్పు కోసం సిపిఐ నిరంతర పోరాటం చేస్తుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక, విద్యార్థి, మహిళా ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టబోయే పోరాటానికి ప్రజల మద్దతు అవసరమని జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే ప్రచార పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. గడచిన 30 సంవత్సరాలుగా పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు జూలై 1 నాటికి అందిస్తామని ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేరలేదని ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వాల్సిన ఆర్ ఆర్ ప్యాకేజీని పరిష్కరించాలన్నారు. 2025 డిసెంబర్ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రూ. 5000 కోట్లు కేటాయిస్తే ప్రజలకు తాగునీరు వెలుగొండ ద్వారా అందుతుందని ప్రభుత్వం ఈ ప్రస్తావన చేయడం లేదని ఆయన అన్నారు. దేశంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు పడక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల సాగు లేక అటు రైతులు వ్యవసాయ కూలీలు పనులు లేక తీవ్రమైన కరువు పరిస్థితులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని మార్కాపురం జిల్లాలోని 21 మండలాల్లో కరువు చాయలు నెలకొన్నాయని అన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు డి శ్రీనివాస్ మాట్లాడుతూ



మార్కాపురం జిల్లాను తీవ్ర కరువు జిల్లాగా ప్రకటించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో పంటలు పండక, పంటలు పండించిన రైతులకు గిట్టుబాటు ధరలు లభించక, పారిశ్రామిక అభివృద్ధి లేక యువతకు ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళ్తున్నారని దశాబ్దాలుగా మార్కాపురం జిల్లా ఏర్పడే నాటికి కూడా కొనసాగుతుందన్నారు. మార్కాపురం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రూ. 10 వేల కోట్ల రూపాయలను కేటాయించాలని, అన్ని రంగాల్లోనూ అభివృద్ధికై ఈ నిధులను కేటాయించాలని ఆయన కోరారు. ఇటీవల దేశంలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పార్టీలకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని ప్రజల్లో మార్పు రావాలనే ఆకాంక్షతో సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్నే సాంబశివరావు, గుంటూరు శ్రీనివాసాచారి, మంత్రునాయక్, పారిశుద్ధ్య కార్మికులు, సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తల్లిపాలతోనే శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం

### సిడిపిఓ షేక్ ఆశాబేగం





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 7**

తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి తల్లికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ షేక్ ఆశాబేగం అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు వెలిగండ్ల పరిధిలోని సి.ఎస్.పురం అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీడీపీఓ షేక్ ఆశాబేగం మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే ముర్రిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమన్నారు. ముర్రిపాలలో శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంపొందించే గుణాలు ఉంటాయని తెలిపారు. పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలను మాత్రమే అందించాలని సూచించారు.తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు అనేక అనారోగ్య సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయని వివరించారు. ప్రతి శిశువుకు వంద శాతం తల్లిపాలు అందేలా తల్లులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. తల్లిపాలతో శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు.అంగన్వాడీ కార్యకర్తలు తల్లిపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు దేవ కృపావరం, సరళ, అంగన్వాడీ కార్యకర్తలు రఫియా, నారాయణమ్మ, రాధా, మాధవి, నారాయణమ్మ, మాధవి, వెంకట లక్ష్మమ్మ, రమా గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# గుండ్ల సముద్రం అంగన్ వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు సమావేశం



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 7**

మర్రిపూడి మండలం లోని గుండ్ల సముద్రం అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. శుక్రవారం నాడు జరిగిన ఈ సమావేశానికి కొండేపి ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ విక్టోరియా రాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విక్టోరియా రాణి మాట్లాడుతూ పుట్టిన శిశువుకు తల్లిపాలు అమృతం కన్నా ఎక్కువగా అభివర్ణించారు. ఆరు నెలలపాటు శిశువుకు తల్లిపాలు ఇప్పించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, హెచ్ ఎం బాబురావు, అంగన్ వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి స్టేట్ బిసి సెల్ జనరల్ సెక్రెటరీ గా పిఎల్ పి యాదవ్

### పార్టీ నేతలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసిన పి ఎల్ పి.

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 7**

వైసిపి స్టేట్ బిసి సెల్ జనరల్ సెక్రెటరీ గా నియమితులైన పి ఎల్ పి యాదవ్ ను శుక్రవారం బిసి సంఘం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు,పలు ప్రజా సంఘాల ప్రతినిధులు కలసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి స్టేట్ సెక్రెటరీ డాక్టర్ మీర్జా షశీషీర్ ఆలీబెగ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సిహెచ్ బాల మురళి క్రిష్ణ, బిసి సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో పి ఎల్ పి యాదవ్ చేత కేక్ కట్ చేయించి మిఠాయిలు తినిపించారు.పి ఎల్ పి యాదవ్ ను కలసి అభినందనలు తెలిపిన వారిలో బిసి సంఘం నియోజక వర్గ అధ్యక్షులు ఐ.రంగస్వామి గౌడ్, మెట్ల చెంచయ్య యాదవ్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుమ్మా బాల నాగయ్య, మాజీ ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సాయి స్వామి, బ్రాహ్మణ సంఘా నాయకులు కె.శ్రీనివాస్, కాటమరాజు దేవస్థానం పాలక మండలి సభ్యులు గంగుల ఎల్లయ్య యాదవ్, గోసు సుబ్బారావు యాదవ్,బిసి భవన్ అధ్యక్షులు ఆర్.పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి కె.అబ్రహం రాజ్ కుమార్, సంఘ నాయకులు నాగం రామక్రిష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్, రాంబాబు ముదిరాజ్, వైసిపి నాయకులు శివారెడ్డి, తదితరులు ఉన్నారు.



# రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి

## ఎల్నినోపై రైతులకు అవగాహన -రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహణ

**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 07**

ఎల్నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఆరుతడి పంటలపై దృష్టి కేంద్రీకరించాలని మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ తెలిపారు. శుక్రవారము మండల కేంద్రం నందలి గుడ్లూరు-1 మరియు గూడూరు -2 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఎం.ఏ.ఓ రవికుమార్ ఆధ్వర్యంలో ఆర్.ఎం.కె కమిటీ అధ్యక్షతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయశాఖ మరియు అనుబంధ రంగాల సమన్వయంతో ఏర్పాటు చేయబడిన కార్యక్రమం. అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవికుమార్ మాట్లాడుతూ రైతన్నా మీకోసం కార్యక్రమం వారం రోజులు అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో జరుగునని, అనుబంధ శాఖల సిబ్బంది అన్ని కుటుంబాలను సంప్రదించి ఎల్నినో యొక్క ప్రభావం గురించి వివరించి అప్రమత్తం చేసెదరన్నారు. ముఖ్యంగా రైతులు ఎల్నినో ప్రభావం వలన వర్షాలు పడే పరిస్థితి లేదు కనుక వరి పంట సాగు చేయడం మాని ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. ఇప్పటికే వరి పంట సాగు చేసినవారు తప్పనిసరిగా భీమా చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రము





సిబ్బంది ఈ-పంట చేసి పంట లేని ప్రాంతాన్నీ, పంట ఉన్న పరిస్థితిని అంచనా వేసేదరన్నారు. అలానే పశుసంవర్ధక సిబ్బంది పశువుల పరిస్థితి , మేత, పశువులు త్రాగడానికి నీటి లభ్యత గురించి అంచనా వేసేదరని, ఆర్.డబ్ల్యూ.ఎస్ వారు త్రాగునీటి పరిస్థితి గురించి అంచనావేసి నివేదిక సమర్పించేదరన్నారు. తదుపరి వారం నివేదిక ప్రకారం అన్నిశాఖలవారు ఎల్నినో ప్రభావం నుండి ఏ విధంగా బయటపడాలి అనే దాని గురించి కార్యాచరణ తయారుచేసి రైతులను, సామాన్య ప్రజలను అప్రమత్తం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా వెటర్నరీ డాక్టర్లు అలీ, వీ.ఏ.ఏ లు సుధారాణి, రోషిని, గ్రామ నాయకులు మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు .

## గిద్దలూరు విశ్రాంత ఉద్యోగులకు ఆటల పోటీల

### స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులకు ఆటలు పోటీలు ఈ నెల 8 ,9 , 10 తేదీల్లో నిర్వహించబడునని ఆసంఘం అధ్యక్షులు జి రవీంద్రనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు క్యారమ్స్ , చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 11 వ తేది స్పోర్ట్స్ ఈవెంట్స్ పోటీలు నిర్వహించబడునన్నారు. ఈ పోటీలు ప్రతిదినం ఉదయం 10-00గంటలకు మొదలవుతాయని పేర్కొన్నారు . క్యారంబోర్డు సీనియర్స్, డబుల్స్ , జూనియర్ డబుల్స్ సింగిల్స్లో పోటీలు నిర్వహించేందుకు చార్ట్ ను రూపొందించామని పేర్కొన్న లిస్ట్ ప్రకారం మీ మీ జట్టు ప్రకారం ఆటల పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వ్యక్తి గత పోటీలలో మీరు ఎవరు,ఎవరితో ఆడవలెనో చూచుకొని పాల్గొన వలసినదిగా కోరుతున్నామన్నారు.

## రిటైర్డ్ టీచర్ షేక్ చిన్న ఖాదర్ వలీ మృతి

### నల్లగుంట్ల లోని ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా చేసి పదవి విరమణ చేసిన ఖాదర్ వలీ

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 7**



కొమరోలు పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు షేక్ చిన్న ఖాదర్ వలీ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం సాయంత్రం కొంత ఆనారోగ్యం బాధపడుతున్న ఖాదర్ వలిని కుటుంబ సభ్యులు గిద్దలూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖాదరవలిని ఒంగోలుకు తరలించవలసిందిగా అక్కడ డాక్టర్లు సూచించారు. దీనితో కుటుంబ సభ్యులు ఖాదర్ వలిని ఒంగోలు తరలించే ప్రయత్నం చేస్తుండగానే ఆరోగ్యం మరింత విషమించి ఆసుపత్రిలోనే మృతి చెందారు. దీనితో ఖాదర్ వలీ కుటుంబంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. ఆయన మృతదేహాన్ని గురువారం రాత్రికి కొమరోలు లోని ఇస్లాం పేటలో గల ఆయన నివాస గృహానికి చేర్చారు. దీనితో ఆయన కుటుంబంతో పాటు ఆ వీధి రోదనలతో నిండిపోయింది. టపా బావి వీధికి పెద్దరికంగా ఉంటూ అందరితో కలిసి మెలిసి స్నేహపూర్వకంగా వ్యవహరిస్తున్న ఖాదర్ వలీ ఆకస్మికంగా మృతి చెందడాన్ని ఆ వీధి ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఖాదర్ వలీ అంత్యక్రియలు శుక్రవారం కుటుంబ సభ్యులు బంధుమిత్రుల కన్నీటి వీడ్కోలు మధ్య నిర్వహించారు. ఖాదర్ వలీ నల్లగుంట్ల లోపల ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసే గత మూడేళ్ల క్రితం పదవీ విరమణ చేశారు. ఖాదర్ వలీ మృతి చెందినట్లుగా సమాచారం అందుకున్న మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బంధుమిత్రులు ఖాదర్ వలీ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఘనంగా పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ 157 జయంతి

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 07**

ప్రకాశం జిల్లా బీ.సీ సంక్షేమ, సాధికారత అధికారిని ఎస్. నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ 157 జయంతి కార్యక్రమం ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ, , పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కుల సంఘం నాయకులు చాపల సాయి రామ్ వర్మ, అవనిగడ్డ నాగయ్య, కోలా శ్రీ రామ మూర్తి, కొక్కిలిగడ్డ సుబ్బారావు, సింగోతు ఏడుకొండలు, కొక్కిలిగడ్డ భగవాన్, కొక్కిలిగడ్డ పరంజ్యోతి,కొక్కిలిగడ్డ వెంకటేష్, సహాయ సంక్షేమ ఇంచార్జ్ అధికారి, సి.హెచ్. వెంకట్రావు, జిల్లా బి.సి. ప్రధాన కార్యాలయం సిబ్బంది, బి సి వసతి గృహ సంక్షేమ అధికారులు, నాల్గవ తరగతి సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.





## నిధులు తెచ్చింది నేను .. అంతా మీ ఇష్టా రాజ్యమా

## మండల సమావేశంలో జడ్పీటీసీ ఆగ్రహం



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగష్టు 7**

జడ్పీటీసీ గా ఎన్నికైన నేను మండల అభివృద్ధి కోసం జిల్లా పరిషత్ నుంచి నిధులు తెస్తే, ఎక్కడ ఖర్చు పెట్టారో వివరాలుతెలుపరా అంతా మీ ఇష్టా రాజ్యమా అని జడ్పీటీసీ చేదూరి విజయ భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. శుక్రవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో అయన మాట్లాడారు.త్రాగునీటి సమస్య తీర్చేందుకు బోర్లను మంజూరు చేయించానని ప్రజలకు సేవా చేసేందుకే గాని కమిషన్లకోసం కాదని, మాకు గుర్తింపు ఇవ్వరా అని ఆర్ డబ్ల్యూ యస్ అధికారులను ప్రశ్నించి వివరాలు ఇవ్వాలని కోరారు. ఇబ్రాయిల్ పేటలో పంచాయతీ రాజ్ నిధులు 20లక్షలు మంజురు చేపిస్తా మాకు పనులు చేయానియరు మీరు చేయరు అభివృద్ధి ఎలా సాధ్యం అని అన్నారు. వైస్ యంపిపి శేషు మాట్లాడుతూ సాగర్ నీరు సరఫరా విషయంలో అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మకై అవినీతికి పాల్పడుతున్నారని, యాభై శాతం లెస్ చేస్తున్నారని, జి పి యస్ విధానం లేదని లక్షల రూపాయలు బిల్లులు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. సాగర్ నీరు సరఫరా సరిగా చేయడం లేదని ఆర్ డబ్ల్యూ యస్ ఆఫీస్ దగ్గరలో నివసిస్తున్న సుమారు 60కుటుంబాలకు నీరు అందించలేక పోతున్నారని అన్నారు.యంపిపి దొంత కిరణ్ గౌడ్ మాట్లాడుతూ అధికారులు గ్రామాలలో సమస్యలు గుర్తించి త్వరిత గతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని, మండల అభివృద్ధిలో నాయకులతో కలిసి అధికారులు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ బండారు శ్రీనివాసరావు, ఇంచార్జి తహసీల్దార్ విజయ భాస్కర్, ఇతర శాఖల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## రైతుకు గిట్టుబాటు ధర... వినియోగదారునికి తక్కువ ధర

### ఇదే రైతు బజార్ల ఏర్పాటు లక్ష్యం -జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఎమ్మెల్యే కందుల





**మార్కాపురం పెన్ పవర్ ఆగష్టు 7**

కూరగాయలు, పండ్లు అమ్మకం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు తక్కువ ధరకు వాటిని అందించడమే రైతు బజార్ల లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత తెలిపారు. మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో శుక్రవారం రైతు బజార్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కూరగాయలు, పండ్లు పండించే రైతులు తమ ఉత్పత్తులను నేరుగా అమ్ముకోవడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయన్నారు. అదేవిధంగా ప్రజలకు నాణ్యమైన కూరగాయలు తక్కువ ధరకే లభించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ రైతు బజార్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. మార్కెట్ యార్డ్ ఫీజులు, దళారీ కమిషన్ లేకుండా నేరుగా రైతులు అమ్ముతున్నందున అమ్మిన రోజే వారికి డబ్బు చేతికి వస్తుందన్నారు. రైతులు పండించిన వాటిని వారే అమ్ముకోవడం వల్ల నష్టం కూడా ఉండదని వివరించారు. పొలం నుండి నేరుగా రైతు బజార్లకు తీసుకురావడం వల్ల నాణ్యత, తాజాదనం ఎక్కువగా ఉంటుందన్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు పెరగకుండా వీటి ద్వారా అడ్డుకట్ట వేయవచ్చన్నారు. రైతు బజార్ అనేది రైతు - వినియోగదారునికి వారధిగా నిలబడుతుందన్నారు. వీటివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డి, జనసేన పార్టీ ఇన్చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బిజెపి జిల్లా అధ్యక్షులు కృష్ణారావు ఏఎంసి చైర్మన్ వెంకటరెడ్డి ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సెయింట్ జేవియర్ లో మొక్కలు నాటిన న్యాయమూర్తులు విద్యార్థులు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 07**

ఆగస్టు 15వ తేదీ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఒంగోలులోని సెయింట్ జేవియర్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ. సత్యానంద్ ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్చార్జ్ కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం ప్రాముఖ్యత, మొక్కల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులకు సాధారణ న్యాయ అంశాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల హక్కులు, బాధ్యతలు, బాలల రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉచిత న్యాయ సహాయం పొందే విధానం తదితర అంశాలను వివరించారు. గిరిజనుల హక్కులు, వారి రాజ్యాంగపరమైన రక్షణలు, గిరిజనుల భూమి జీవనోపాధికి సంబంధించిన హక్కులు, విద్యా, సామాజిక సంక్షేమ హక్కులు, వివక్షకు గురి కాకుండా చట్టపరంగా లభించే రక్షణలు తదితర అంశాలపై



విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకుని, ఇతరుల హక్కులను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిరుమల కిషోర్ బాబు, పాఠశాల కరస్పాండెంట్ సుందరి సిస్టర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ, అధ్యాపకేతర సిబ్బంది, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటడంతో పాటు న్యాయ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**అర్ధవీడు, పెన్ పవర్, ఆగష్టు 7**

గిద్దలూరు నియోజకవర్గం అర్ధవీడు మండలం మొహిద్దిన్ పురం గ్రామంలో "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా మొహిద్దిన్ పురం పంచాయతీ నాయకులు , ప్రజలు ఎమ్మెల్యే కు పూలమాల , హారతి ఇచ్చి సాగర స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పట్టణం , గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. అనంతరం గ్రామంలో నాయకులు, మహిళలు ప్రజలు ఎమ్మెల్యేను శాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్ధవీడు మండల తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎల్నినో ప్రభావితంతో వరికి ప్రత్యామ్నాయ పంటలే పరిష్కారం

### - వ్యవసాయాధికారి షేక్ సైదాలి

**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 7**

ఎల్నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంసిద్ధులు కావాలని మండల వ్యవసాయాధికారి షేక్ సైదా సూచించారు. సంతమాగులూరు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన "రైతన్నా మీకోసం -- ఎల్నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఏల్చూరు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా కంది, జొన్న, పెసర, మినుము వంటి వర్షాభావ పరిస్థితులను తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం సాగులో ఉన్న పంట పొలాలను పరిశీలించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అలాగే పంటల బీమా (క్రాప్ ఇన్సూరెన్స్) నమోదు గడువు ఆగస్టు 15 వరకు ఉన్నందున ప్రతి రైతు ప్రీమియం చెల్లించి తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి చైతన్య, ఎంపీఈఓ రామాంజనేయులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

**– జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ – కలెక్టరేట్‌లో ఘనంగా 12వ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహణ**





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 07**

స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో చేనేత కళను పరిరక్షించుకోవడంతో పాటు, చేనేత కార్మికుల కుటుంబాలకు ఆసరాగా నిలిచి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. చేనేత.. జౌళి శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ ప్రసంగిస్తూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాచీన కళావైభవానికి చేనేత రంగం ప్రతీక అని కొనియాడారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,210 మంది చేనేత కార్మికులు ఉన్నారని, 12 చేనేత సహకార సంఘాలు విస్తరించి ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రధానంగా రూపుదిద్దుకునే జాకార్డ్ డిజైన్ చీరలు, సెమీ గద్వాల్ చీరలు, లుంగీలు, డ్రెస్ మెటీరియల్స్, షర్టింగ్ వస్త్రాలకు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉందన్నారు. ?ప్రభుత్వం చేనేత రంగానికి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వృద్ధాప్యంలో ఉన్న చేనేత కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు 'ఎన్.టి.ఆర్. భరోసా' పథకం కింద వయో పరిమితిని 65 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు ప్రభుత్వం తగ్గించ్చిందని తెలిపారు. దీని ద్వారా జిల్లాలో ప్రస్తుతం 920 మంది చేనేత కార్మికులకు ప్రతినెల రూ. 4,000/- చొప్పున పింఛను అందుతోందని ఆయన వివరించారు. అలాగే, నేతన్నలు స్వయం సమృద్ధి సాధించేందుకు 'చేనేత ముద్రా యోజన' ద్వారా బ్యాంకుల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, మార్చి 2026 నాటికి 13 దరఖాస్తులకు రూ. 13.00 లక్షల రుణాలు మంజూరు కాగా, రాబోయే 2026-27 ఆర్థిక సంవత్సరానికి 15 ముద్రా రుణాలు లక్ష్యంగా ఉందన్నారు. ?ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి ప్రభుత్వం ఏప్రిల్ 1, 2026 నుండి సమర్థవంతంగా అమలు చేస్తోందని డి.ఆర్.ఓ తెలిపారు. ఈ పథకం కింద చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తుండగా, జిల్లాలో 531 మంది చేనేత కార్మికులు, 3 పవర్ లూమ్ యూనిట్లు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. అంతేకాకుండా, ఈ 12వ జాతీయ చేనేత దినోత్సవం రోజున ప్రభుత్వం నూతనంగా 'నేతన్న సేవలో' పథకానికి శ్రీకారం చుట్టిందని, అర్హులైన ప్రతి చేనేత కార్మికునికి రూ. 25,000/- చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరుగుతోందని తెలిపారు. ఒంగోలు, ఎస్.ఎన్.పాడు, అద్దంకి, కందుకూరు, కొండేపి తదితర నియోజక వర్గాల్లోని స్వర్ణ గ్రామ/ స్వర్ణ వార్డు ల ద్వారా గుర్తించిన 891 మంది అర్హులలో ఇప్పటికే 865 మందికి పైగా లబ్ధిదారులకు ఈ ఆర్థిక ప్రయోజనం చేరుతోందని స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నల శ్రమకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులను సత్కరించారు. ఈ వేడుకల్లో పలువురు ప్రభుత్వ అధికారులు, వివిధ చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వాహనాలకు ఉన్న ఎల్ఇడి లైట్లు తొలగింపు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 07**

ఒంగోలు నగరంలో టిప్పర్లు, ఆటోలు, కార్లు, బైకుల వాహనదారులు వారి వాహనాలకు అమర్చి ఉన్న 90 ఎల్ఇడి లైట్లను ఒంగోలు ట్రాఫిక్ సీఐ సి.హెచ్ హజరతయ్య తొలగించారు. శుక్రవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సిఐ హజరతయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ వాహనాలకు అమర్చి ఉన్న సుమారు 2300 ఎల్ఇడి లైట్లను తొలగించండం జరిగిందన్నారు. ఎల్ఇడి లైట్లు ఉపయోగించడం వలన జరిగే ప్రమాదాలు గురించి ఆటో డ్రైవర్ లకు వివరించారు. ఎదురుగా వచ్చే వాహనాదారులు, బైకులు నడిపే వారి కళ్ళల్లో లైటింగ్ పడటం వలన రోడ్డు మార్జిన్ కనబడక వాహనం అదుపు తప్పటం, ముందు వెళ్లే వాహనాలను గుద్దటం మొదలైన ప్రమాదాలకు ఎల్ఇడి లైట్లు ఒక కారణం అని పేర్కొన్నారు. వాహన యజమానులు, చోదకులు ఎల్ఇడి లైట్లు అమర్చుకుండ జాగ్రత్తలు వహించాలని సూచించారు.

# చంటి పాపల తల్లులకు మానవతా సంస్థ ఆసరా




**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 7**

మానవతా స్వచ్ఛంద సంస్థ చంటి పాప తల్లులకు ఎంతో ఆసరాగా ఉంటుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు మువ్వల పార్థసారథి అన్నారు. శుక్రవారం నాడు స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చంటి పాపలకు పాలిచ్చేందుకు తల్లుల కోసం ప్రత్యేకమైన గదిని నిర్మించారు. మానవత సంస్థ నిర్మించిన గదిని పొదిలి సి డి పి ఓ సుధా మారుతి, మునిసిపల్ కమిషనర్ రామ్మోహనరావులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన సుధాకర్ మారుతి, రామ్మోహనరావు లు మాట్లాడుతూ చంటిపాపలకు పాలు ఇచ్చేందుకు తల్లుల కోసం ఇటువంటి సదుపాయాన్ని కల్పించిన మానవత సంస్థ కార్యవర్గానికి వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులతోపాటు పలువురు అధికారులు, వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ--2025 అక్రమాలపై వైసీపీ భగ్గు

**సీబీఐ విచారణ చేయాలి, మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి: బూచేపల్లి**

**నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది: అన్నా రాంబాబు**





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 7**

కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ--2025 టీచర్ పోస్టుల నియామకాల్లో జరిగిన అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం మార్కాపురం ఆర్‌డీఓ కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహించింది. రెండోరోజు కొనకనమిట్ల, పొదిలి మండలాల ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షలకు మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబు నాయకత్వం వహించారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నిరసనలు చేపట్టారు.దీక్ష రెండో రోజు ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొని, ఉదయం నుండి దీక్షలో ఉన్నవారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజాయితీగా చదివిన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని,విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లి నైతిక బాధ్యత వహించి రాజీనామాలి చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ, డీఎస్సీ--2025 నియామక ప్రక్రియలో జరిగిన అక్రమాలు రాష్ట్రంలోని నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడే చర్యలు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా పారదర్శకమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ మున్సిపల్ మాజీ చైర్మన్ చలంచర్ల బాలమురళీకృష్ణ, జడ్పిటిసి నారు బాపన్ రెడ్డి, కోటిరెడ్డి, చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, 18 బ్లాక్ ఇన్చార్జి సయ్యద్ గఫూర్, విద్యార్థి విభాగం నాయకులు అంజిరెడ్డి, గౌస్ మొహిద్దిన్, టౌన్ సోషల్ మీడియా అధ్యక్షులు రఫీ, ఆయుబ్, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల నాయకులు, యువత పాలుగున్నారు.

# 4గురు జూదరులు అరెస్ట్



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 07**

ప్రకాశం జిల్లా టంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వేరెడ్డి పాలెంపంచాయతీ గ్రామంశివారులో శుక్రవారం పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్సై ఎస్. జెత్యా నాయక్, ఏ.ఎస్ఐ షేక్ మహబూబ్ బాషా వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 4 గురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.12200/- నగదు, 4 మొబైల్ ఫోన్లును స్వాధీనం చేసుకున్నారు. వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు నిమిత్తం టంగుటూరు పోలీస్ స్టేషన్లో టాస్క్ ఫోర్స్ పోలీసులు అప్పగించారు.

# గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో 99 శాతం లే ఔట్లకు అనుమతులు

**కమీషనర్ ఈ వి రమణ బాబు**

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**

గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో అధికార , అనధికార లేఅవుట్లపై చర్యలు గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని లేఅవుట్లపై చేపట్టిన పరిశీలనలో, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ నిబంధనల ప్రకారం మొత్తం 69 ఇన్-ప్రిన్సిపుల్ లేఅవుట్ ప్యాటర్న్లు సిద్ధం చేయబడ్డాయి. వీటిలో 68 ఆమోదం పొందగా, 1 ఐ పి ఎల్ పి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉందని. అదనంగా 3 రెగ్యులర్ లేఅవుట్లకు అనుమతులు మంజూరు చేయబడ్డాయని తెలిపారు. ఈ వివరాల ప్రకారం, గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని లేఅవుట్లలో దాదాపు 99 శాతం లేఅవుట్లకు అనుమతులు పొందడం జరిగిందని కమీషనర్ రమణ బాబు తెలిపారు. మిగిలిన లేఅవుట్లకు సంబంధించి కూడా నిబంధనల ప్రకారం పరిశీలన , తదుపరి చర్యలు కొనసాగుతున్నాయి.అదేవిధంగా, మున్సిపాలిటీ పరిధిలో 6 అనధికార లేఅవుట్లను గుర్తించడం జరిగింది. వీటిపై మే నెల 29. మరియు 30 తేదీలలో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు ప్రారంభించబడ్డాయని. అనధికార లేఅవుట్లలో తదుపరి అభివృద్ధి పనులు ప్లాట్ల విక్రయాలను , నిరోధించేందుకు నోటీసులు జారీ చేసి, చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయన్నారు.అనధికార లేఅవుట్లపై చర్యలు ప్రారంభించిన తేదీల నుండి ఇప్పటి వరకు గిద్దలూరు పట్టణ పరిధిలో కొత్తగా అనధికార లేఅవుట్లను ప్రారంభించినట్లు గుర్తించబడలేదన్నారు. భవిష్యత్తులో నిబంధనలకు విరుద్ధంగా అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేసినా లేదా అభివృద్ధి చేసినా, సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని. ప్రజలు అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు, చేయకుండా, ప్లాట్ కొనుగోలు చేసే ముందు సంబంధిత మున్సిపల్ అధికారులను సంప్రదించి, లేఅవుట్ అనుమతి, లేఅవుట్ నంబర్, ఇతర సంబంధిత వివరాలను తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని గిద్దలూరు మున్సిపాలిటీ కమీషనర్ రమణ బాబు సూచించారు.

# టీడీపీలోకి భారీగా వలసలు - వైసీపీకి షాక్


**గిద్దలూరు నియోజకవర్గం అర్ధవీడు మండలంలో వైసీపీని వీడి 13 కుటుంబాలు టీడీపీలో చేరిక**

**కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి**



**అర్ధవీడు, పెన్ పవర్, ఆగస్టు 7**

అర్ధవీడు మండలం మాగుటూరు పంచాయతీ పరిధిలోని బసిరెడ్డిపల్లి, తండా, మాగుటూరు గ్రామాలకు చెందిన 13 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో శుక్రవారం చేరారు. సర్పంచ్ జయరాం నాయక్, కరణం కాసయ్య, బత్తిని సర్వేశ్వరరావు, ఎర్రగుంట్ల రాజన్న, పేర్నపాటి రామసుబ్బయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గంగుల వెంకటేశ్వర్లు, వల్లెల సత్యనారాయణ రెడ్డి, వెంకట రెడ్డి, ఎనుముల పెద్ద అంకాలు, వెంకట కిట్టయ్య, నల్లబోతుల లక్ష్మయ్య, చెన్నకిట్టయ్య, గోనవత్ మంత్రు నాయక్, బాలు నాయక్, దేశవత్ శ్రీరాములు నాయక్, సీతాభాయ్, రాత్లవత్ వెంకటేశ్వర్లు, నల్లబోతుల చెన్నయ్య తదితరులు వైసిపి కాంగ్రెస్ పార్టీ ని విడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో నమ్మకం రోజురోజుకూ పెరుగుతోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరుతున్నారని తెలిపారు. టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు.



# జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం... ఎమ్మెల్యే దేవ..





**సఖినేటిపల్లి, పెన్ పవర్, ఆగస్టు 7**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం వివి మెరక లో చేనేత కార్మికుల చే జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం ను ఘనంగా నిర్వహించినారు. ముఖ్య అతిథిగా రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ పాల్గొనినారు. "నేతన్న సేవలో" ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని 751 మంది అర్హులైన చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించిందని, చేనేత రంగాన్ని పరిరక్షించడంతో పాటు చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపర్చేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, నియోజకవర్గంలోని చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత కార్మికుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి శ్రమ దేశానికి గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాజోలు ఇంచార్జి గొల్లపల్లి అమూల్య, మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి నరసింహారావు, ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం వల్ల ఎంతో మేలు

### పొదిలి జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష




**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 7**

కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంలో ఎంతో మేలు జరుగుతుందని పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వి. ప్రత్యూష అన్నారు. శుక్రవారం నాడు పొదిలిలో మధ్య వర్తిత్వం అవగాహన మోటారు సైకిళ్ళ ర్యాలీ జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న న్యాయమూర్తి ప్రత్యూష మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడమే కాకుండా ఇరువర్గాల మధ్య మంచి సంబంధాలు ఏర్పడే అవకాశాలుంటాయన్నారు. అందువల్లనే న్యాయవ్యవస్థలో రాజీమార్గం, రాజమార్గం అనే నానుడి ఉందని న్యాయమూర్తి ప్రత్యూష చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచార నిందితుడికి మూడేళ్ల జైలు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 07**

ఒంగోలులో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి మూడు సంవత్సరాలు జైలు, రూ. 5,000/- లు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి శైలజ శుక్రవారం తీర్పును వెల్లడించారు. వివరాల్లోకి వెళితే ఒంగోలు పట్టణానికి చెందిన మైనర్ బాలిక (17) పై ఒంగోలు మారుతి నగర్ కు చెందిన మార్తల మహేంద్ర రెడ్డి 2017న దొనకొండ మండలం ఎండల చెరువు ముద్దాయి బంధువుల ఇంటికి తీసుకువెళ్లి బాలికపై అత్యాచారం చేసినట్లు బాధితురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయింది. అప్పటి ఒంగోలు డి.ఎస్.పి శ్రీధర్ ముద్దాయిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో ప్రత్యేక పోక్సో మానిటరింగ్ టీం ద్వారా సమర్థవంతంగా ట్రైల్ నడిపి సరైన సాక్ష్యాధారాలతో నిందితునిపై పలు సెక్షన్ల కింద నేర నిరూపణ చేయడంతో పోక్సో కోర్టు జడ్జి శైలజ ముద్దాయికి మూడేళ్లు జైలు శిక్ష, 5,000/- రూపాయలు జరిమానా తోపాటు బాధితురాలకి నష్టపరిహారంగా రూ. 4,000/- లు చెల్లించాలని తీర్పునిచ్చారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. ఈ కేసులో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన అప్పటి డీఎస్పీ శ్రీధర్, ప్రస్తుత ఒంగోలు 1 టౌన్ సిఐ వెంకటేశ్వరరావు, పోక్సో కోర్టు స్పెషల్ పీపీ గొట్టిపాటి శ్రీనివాసరావు, కోర్టు లైజెన్ ఏఎస్ఐ స్వామి, పిసి ఎలమంద, ఒంగోలు వన్ టౌన్ సేషన్ కోర్టు పిసి చంద్రశేఖర్ లను ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

## చీమలేటి పల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్న నీకోసం కార్యక్రమం





**అర్ధవీడు, పెన్ పవర్, ఆగష్టు 7**

అర్ధవీడు మండలంలోని చీమలేటి పల్లి గ్రామంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్న నీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా వ్యవసాయ అధికారి బాలాజీ నాయక్ గారు, ఎపిసి ఎన్ ఎఫ్ డిపిఎం సుదర్శన్ రాజు, ఇన్చార్జ్ జిల్లా ఉద్యాన అధికారి జేనమ్మ ముఖ్య అతిథులుగా హాజరవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా వ్యవసాయ అధికారి బాలాజీ నాయక్ మాట్లాడుతూ రైతన్న నీకోసం కార్యక్రమంలో ఆర్ఎస్కే కమిటీల ద్వారా ప్రస్తుత పంట పరిస్థితిని, నీటి కొరత వలన పంట వాడిపోవడం లేదా ఎండిపోవడం చీడపీడల ఉధృతి సాగు చేయని భూములు వివరాలు వంటి అంశాలను అంచనా వేసి తగు సూచనలను రైతులకు తెలియపరుస్తారని ,అలాగే బీడు ఉన్న సాగు చేపట్టని పొలాల్లో స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను మరియు బెట్టను తట్టుకునే ఆరుతడి పంటలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం పురోగతిని ఎపిఎఐఎంఎస్ 2.0 ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందిని, అలాగే ఫార్మర్ యాప్ ద్వారా రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందజేయడం జరుగుతుందని వివరించారు. ఇందులో భాగంగా రైతులకు విత్తనాలను విత్తన బంతులుగా చేసి చల్లడం వల్ల కలిగే లాభాలు మరియు వాటిని ఏ విధంగా తయారు చేయాలో ప్రత్యక్ష ప్రదర్శన ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సజ్జా మనోహర్, హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్, విఏఎలు ప్రసంగి, సునీత మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ నిరసన జ్వాలా

## బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు: డాక్టర్. అశోక్ కుమార్

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 07:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో భారీ అక్రమాలు, అవినీతి జరిగాయని ఆరోపిస్తూ అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈ దీక్షా శిబిరానికి అద్దంకి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్. అశోక్ కుమార్, ప్రకాశం జిల్లా పార్టీ టాస్క్ ఫోర్స్ పరిశీలకులు బత్తుల. బ్రహ్మానంద రెడ్డి హాజరై పూర్తి సంఘీభావం తెలిపారు.

**అర్హులైన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం..**

డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. డీఎస్సీ అక్రమాలపై ఆడియో, వీడియో ఆధారాలు బయటపెట్టినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం శోచనీయమన్నారు. లక్షలాది రూపాయలకు పోస్టులు అమ్ముకోవడం, తమ అనుచరులకు ఉద్యోగాలు కట్టబెట్టడం, క్రీడా కోటాలో నకిలీ సర్టిఫికెట్లు సృష్టించడం వంటి చర్యలతో నిజమైన అర్హులకు తీవ్ర అన్యాయం జరిగిందని మండిపడ్డారు. డీఎస్సీలో అన్యాయానికి గురైన ప్రతి ఒక్క అభ్యర్థికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండాలంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.




**హామీలు విస్మరించిన కూటమి ప్రభుత్వం..**

ఎన్నికలకు ముందు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం యువతను మోసం చేసిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు దాటినా నిరుద్యోగ భృతి అమలు చేయకుండా ఖజానా ఖాళీగా ఉందంటూ సాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలను విస్మరించిన ఈ ప్రభుత్వానికి యువత తగిన సమయంలో బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. అర్హులైన అభ్యర్థులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పార్టీ పరంగా పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# గిద్దలూరు హైస్కూల్ ప్లస్ ను తనిఖీ

## ఉప విద్యాశాఖ అధికారి- శ్రీనివాసులు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**

గిద్దలూరు పట్టణంలోని హై స్కూల్ ప్లస్ లో శుక్రవారం మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ప్రగడ శ్రీనివాసులు తనిఖీ చేశారు. హై స్కూల్ ప్లస్ లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థుల ప్రోగ్రెస్ ను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు మిషన్ మార్చి ప్రోగ్రాం నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులను ఇటీవల జరిగిన యూనిట్-1 గురించి అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఇంటర్మీడియట్ లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్, లీప్ యాప్, విద్యాశక్తి, మిషన్ మార్చి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడానికి తగు సూచనలు తెలియజేశారు. ఈ కళాశాలలో ఇటీవల నిర్వహించిన హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించి ఎన్.సి.సి. అధికారి గా వ్యవహరిస్తున్న డాక్టర్ మొర్రి. పిచ్చయ్య ను అభినందించారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థి పైన ప్రత్యేక శ్రద్ధ వహించి ఎక్కువ మార్కులు సాధించేల కృషి చేయాలని సూచించారు. హై స్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ కళాశాల అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ, బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి గిరిధర్ శర్మ, మండల విద్యాశాఖ అధికారి కావడి వెంకటేశ్వర్లు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రసూల్, కళాశాల సిబ్బంది బాల గురవయ్య, స్వామి కుమార్, విజయరాజ, సగీర్, శ్రీరామిరెడ్డి, పీరయ్య, శోభారాణి,బీబి పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి మాట్లాడారు. అనంతరం మార్కాపురం డివిజన్ కు నూతన ఉప విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును పూలమాల, దుశ్శాలువతో సత్కరించారు.

## సిపిఐ సభను విజయవంతం చేయాలి



**సి ఎస్ పురం , పెన్ పవర్ ఆగస్టు 7**

ఈనెల 11వ తేదీన కనిగిరిలో జరుగు సిపిఐ సభను జయప్రదం చేయాలని మండల సిపిఐ కార్యదర్శి ఎస్ కే వై పెద్ద మస్తాన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసి చైతన్యవంతులను చేసేందుకు సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు 6వ తేదీ నుండి ప్రచార పాదయాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం రెండవ సి ఎస్ పురం మండలంలో నిర్వహించామన్నారు. 11వ తేదీన కనిగిరి లో జరుగు సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పాల్గొంటారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రభాకర్ కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ సహాయ కార్యదర్శులు గువ్వల నర్సింహులు సవరం రమేష్ ఎస్ కే వై మౌలాలి బాపట్ల రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ఎమ్మెల్యే అశోకునికి అడుగడుగునా నీరాజనాలు

### ఈప్రాంతనికి వెళ్లిన జేజేలు పలుకుతున్న శ్రేణులు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**

గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు, పార్టీ శ్రేణులు అపూర్వస్వాగతం పలికి నీరాజనాలు సమర్పిస్తున్నారు. ఎమ్మెల్యే గా పదవి భాద్యతలు చేపట్టిన నాటి నుండి గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధి కి బాటలు వేస్తూ , ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి నిధులు రాబట్టి ముందుకు నడిపిస్తున్నారు . గిద్దలూరు ప్రజల చిరకాల వాంఛలు సైతం నెరవేర్చి షెహబాష్ అనిపించుకుంటున్నారు. నిత్యం ప్రజలతో మమేకమై ప్రజాసమస్యలు తెలుసుకుంటూ అవి అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ ప్రజా హృదయాలో చోటుచేసుకున్నారు. గిద్దలూరు లో విద్యుత్ డివిజనల్ కార్యాలయం, బిసి బాలుర గురుకుల పాఠశాల , అన్నిగ్రామాల్లో సి సి రోడ్లు , ప్రతి ఒక్కరికి కార్పొరేట్ వైద్యం అందించే విధంగా ముఖ్యమంత్రి సహాయనిది నిధులు లబ్ధిదారులకు అందించటం, ఇలాయెన్నో సేవాకార్యక్రమాలు చేపట్టారు. కాకుండా ప్రతి సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చే విధానంగా చర్యలు చెప్పాట్టటం ., నిత్యం పార్టీ కేడర్ కు అందుబాటులో ఉంది వారి శ్రేయోభివృద్ధికి పాటుపడటం ఆయన కీర్తి ప్రతిష్టల ను పెంచు తోంది.



ముఖ్యమంత్రి , ఇతరమంత్రులను గిద్దలూరుకు రప్పించి నియోజకవర్గ అభివృద్ధి కి బాటలు వేయటం మారో ఎత్తు ఇలా ఎన్నో ప్రజాఉపయోగకార్యక్రమాలు చేపడుతూ ప్రజాహృదయా ల్లో స్థానం పొందుతున్నారు. ఇప్పటికే పలువురు వైసిపి నుండి టిడిపిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పలు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు ఇదే కారణాలతో అశోకుడి కి ఎక్కడికి వెళ్లినా నీరాజనాలు పలుకుతున్నారు.

## చంటి పాపల తల్లులకు మానవత సంస్థ ఆసరా

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 7**

చంటి పాపల తల్లులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆసరాగా ఉంటుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు మువ్వల పార్థసారథి చెప్పారు. శుక్రవారం నాడు స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో చంటి పిల్లలకు తల్లులు పాలిచ్చే ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. మానవత సమస్త ఏర్పాటుచేసిన ఈ గదిని పొదిలి సి డి పి ఓ సుధా మారుతి, మునిసిపల్ కమిషనర్ రామ్మోహన్ రావు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు సుధా మారుతి, రామ్మోహనరావు లు మాట్లాడుతూ చంటి పిల్లల సౌకర్యం కోసం ఇటువంటి సదుపాయాన్ని ఏర్పాటు చేసిన మానవత స్వచ్ఛంద సంస్థ కార్యవర్గానికి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులతోపాటు పలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అందరికి ఆదర్శం కావాలి

## జాతీయ చెస్ క్రీడాకారుడు ఉపాధ్యాయులు జె ఎమ్ శివ ప్రసాద్

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 07**

గిద్దలూరు మండలంలోని ఎన్ బయనపల్లె ఎంపీయుపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ మహబూబ్ భాష అధ్యక్షతన ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాన్ని ప్రధానోపాధ్యాయునికి అందించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, బి యస్ నారాయణరెడ్డి , జి హెచ్ ఆర్ ఏ సి సి పి సి ఐ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు అందించారు. అనంతరం జాతీయ చెస్ క్రీడాకారుడు ఉపాధ్యాయులు జె ఎమ్ శివప్రసాద్ మాట్లాడుతూ మన ప్రాంతం లో ఆంగ్లేయుల మీద విరోచితంగా పోరాటం చేసినటువంటి ధైర్యవంతుడు ప్రజలను నిద్ర నుండి లేపిన యువకుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన పోరాటం ఆయన యొక్క ధైర్య సాహసాలను విద్యార్థిని విద్యార్థులకు తెలియచేస్తూ ఆయనను ఆదర్శంగా తీసుకొని ఎక్కడ అన్యాయం జరిగిన అవినీతి జరిగిన ఎదిరించే స్థాయికి ఎదిగి అందరూ మంచి విద్యార్థిని విద్యార్థులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. మంచి గుణం కలిగినటువంటి వ్యక్తులతో స్నేహం చేసిన యెడల మనం కూడా మంచి గుణం కలిగిన వారిగా తయారు కావడమే కాకుండా ఇతరులకు ఆదర్శంగా నిలుస్తామన్నారు. మన గిద్దలూరు కొత్తకోట నరవ కంభం ప్రాంతంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బృందం తిరిగి ఆంగ్లేయులను ఎదిరించిన విషయం అందరికీ తెలిసినదే ఇది చరిత్ర చెబుతున్నటువంటి రోజులని తెలిపారు చరిత్రను ఎప్పుడు కూడా తెలుసు కోవాల్సిన అవసరం మనం చెప్పడం భావితరాలకు ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాన్ని అందించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ టీచర్ బి యస్ నారాయణరెడ్డిని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని ఘనంగా సత్కరించారు బి యస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన గొప్ప కార్యక్రమాన్ని ఆంగ్లేయలను ఎదిరించిన తీరును విద్యార్థులకు వివరించాల్సిన బాధ్యత మన మీద ఉందని తెలిపారు అలాగే ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు సత్కరించినందుకు బి యస్ నారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు చిలకల లక్ష్మీ సుధా, చిలకల రమాదేవి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com